
ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

మంగళవారం 20 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	31.5	25.9
కావలి	32	27
ఆత్మకూరు	36	24
ఉదయగిరి	33	27
కందుకూరు	36	27

నడి వేసవిలోనూ నిమ్మ ధర పతనం

కిలో రూ.100 నుంచి 40లకు పతనం



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఎండలు మండుతున్న వేళ ఉష్ణతాపం నుంచి ఉపశమనానికి నిమ్మరసం తాగుతుంటారు. శుభకార్యాలు, వివిధ సందర్భాల్లోనూ నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉంటుంది. అందుకే వేసవిలో నిమ్మకాయలు ధర పెరుగుతుంది. కానీ ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఎండలు మండుతున్నా నిమ్మ ధరలు మాత్రం రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. మార్చి నెలాఖరులో బస్తా రూ.10వేల దాకా పలికింది. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నా కాయల నాణ్యతను బట్టి బస్తా రూ.2వేల నుంచి 5వేల దాకా ఉంది. మార్చి నెలాఖరులో కిలో రూ.100 అమ్మిన నిమ్మకాయలు ప్రస్తుతం రూ.40లకు చేరుకున్నాయి. వేసవిలో ధరలు బాగా ఉంటాయని ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ మిగిలింది. పాకిస్థాన్ - ఇండియా మధ్య యుద్ధం ఓ వారం, మరో వారం ఢిల్లీలో వర్షాలు కురుస్తున్న కారణంగా ధరలు పడిపోయాయి. పొదలకూరు లెమన్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి అట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెనాలి, ఏలూరు, బీజాపూర్ నుంచి నిమ్మకాయలు ఎక్కువగా వస్తున్నాయని, మార్కెట్ తగ్గడానికి ఇది ఒక కారణమన్నారు. అలాగే కేరళాకు ఎక్కువగా నిమ్మకాయల లోడ్లు వెళ్లేవని, అయితే తమిళనాడు నుంచి కాయలకు డిమాండ్ తగ్గిందన్నారు. అంతేగాక కాయల్లో క్వాలిటీ తగ్గడం కూడా ధర తగ్గడానికి మరో కారణమని చెప్పారు. మూడేళ్ల క్రితం ఇదే సీజన్‌లో నిమ్మ బస్తా 16వేల వరకు విక్రయించారు. అయితే గడిచిన రెండేళ్లుగా బస్తా ధర రూ.10వేలు దాటలేదు. ప్రస్తుతం కాయ నాణ్యతను బట్టి రూ.2-5 వేల వరకు ధర పలుకుతోంది.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

ఘాటు తగ్గిన మిరప

గతేడాది క్వింటం రూ.20 వేలు..

ఇప్పుడు రూ.10 వేలే!



ఈసారి ఎండు మిరప ఘాటు తగ్గింది. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటం రూ.16 వేల నుంచి 20 వేలు ధర పలికింది. ఇప్పుడు మాత్రం డిమాండ్ లేదంటూ వ్యాపారులు, దళారులు దోపిడీకి తెరలేపారు. అనంతసాగరం మండలంలోని బొమ్మవరం, చాపురాళ్లపల్లి, అగ్రహారం, గోగులపల్లి, యాకర్లపాడు, సంజీవనగరం గ్రామాల్లో సుమారు 600 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఒక ఎకరా విస్తీర్ణంలో సాగుకు రూ.1.3 లక్షల దాకా ఖర్చు అవుతుంది. అయినా రైతులు వెనకడుగు వేయక సాగుకు ఉపక్రమించారు. అయితే పంటకు తెగుళ్ల వ్యాప్తి, ఎండతీవ్రత, వాతావరణం సహకరించక దిగుబడులు తగ్గాయి. ఇక ఎండు కాయల కోసం పంటను వదులుకోగా అందుకు తగ్గట్టు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 20 క్వింటాళ్లకుపైగా దిగుబడి రావాల్సి ఉండగా నేడు అందుకు భిన్నంగా పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. గుంటూరు మార్కెట్ యార్డ్‌కు ఎగుమతి సక్రమంగా లేదంటూ రూ.10 వేల నుంచి నాణ్యతను బట్టి రూ.12 వేలకు అడుగుతున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావేమోనన్న దిగులు సాగుదారుల్లో నెలకొంది.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

ఈఏపీసెట్ ప్రారంభం

తొలిరోజు 1,277 మంది హాజరు

నెల్లూరు(విద్య), మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, వ్యవసాయ కోర్సులకు సంబంధించి సోమవారం ఈఏపీసెట్ ప్రారంభమైంది. తొలిరోజు బైపీసీ స్ట్రీమ్‌కు రెండు సెషన్స్‌లో పరీక్ష నిర్వహించారు. జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాల్లో వీటిని నిర్వహించారు. ఉదయం 687 మంది హాజరు కావాల్సిఉండగా 625 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 695 మంది హాజరు కావాల్సి ఉండగా 652 మంది కలిపి హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12 గంటలవరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రాల విద్యార్థులను మెటల్ డిటెక్టర్‌లతో తనిఖీ చేసి, బయోమెట్రిక్ వేయించి లోపలకు అనుమతించారు.

● టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు..

నెల్లూరు(విద్య) : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 38 కేంద్రాలో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 454 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు మొత్తం 1343 మంది దరఖాస్తు చేసుకోగా, 889 మంది హాజరయ్యారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశామని డీఈవో బాలాజీరావు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును డీఈవో 5 కేంద్రాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ 18 కేంద్రాల్లో పరిశీలించారు.



నెల్లూరు నగరాన్ని కమ్మిన కరిమబ్బులు

మండుటెండలో చల్ల.. చల్లగా!

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షం

చల్లబడ్డ వాతావరణం

నెల్లూరు (హరనాదపురం), మే 19 (ఆంధ్రజ్యోతి) : మొన్నటిదాకా ప్రచండుడి భగభగలతో అల్లాడిపోయిన జిల్లా ప్రజానీకం సోమవారం కాస్త ఊరటనిచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెల్లవారుజామునుంచే మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా అక్కడ క్కడా ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నెల్లూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి తదితర ప్రాంతా ల్లో వర్షం కారణంగా రోడ్లపై నీరు ప్రవహించింది.

● జిల్లా వర్షపాతం 26.3 మి.మీ

జిల్లాలో సగటు వర్షపాతం 26.3మి.మీ నమోదైంది. అత్యధికంగా దగదర్తిలో 68.4మి.మీ, అత్యల్పంగా కొండాపురంలో 2.0మి.మీ వర్షం కురిసింది. వెంకటాచలంలో 68.2, బోగోలులో 64.8, పొదలకూరులో 57.4, కావలి 55.4, జలదంకి 51.6, కందుకూరు 46.6, విడవలూరు 42.6, కలిగిరి 41.6, ఆత్మకూరు 40.6, అల్లూరు 36.6, ఉలవపాడు, కొడవలూరు 36.4, చేజర్ల 35.2, నెల్లూరు అర్బన్ 6.2, నెల్లూరు రూరల్10.6, సంగం 34.2, ఏఎస్‌పేట 30.6, మనుబోలు 22.6, అనంతసాగరం 21.4, బుచ్చిరెడ్డిపాలెం 19.6, వింజమూరు 18.6, కలువాయి 18.2, టీపీగూడూరు 17.4, దుత్తలూరు 16.8, కోవూరు 16.6, లింగసముద్రం 16.2, ఇందుకూరుపేట 11.4, సైదాపురం 11.2, గుడ్లూరు 8.2, మర్రిపాడు 6.6, ఉదయగిరిలో 6మి.మీ వర్షం కురిసింది.

మామిడికి తప్పని నష్టం

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం మామిడి రైతుల్లో గుబులు రేపుతోంది. అసలే వేసిన పూత పిందెలుగా మారకముందే కాపు తేలిపోయిందని, అడపాదడపా నిలిచిన కాపు కోతకు వచ్చే సమయంలో అకాలంగా కురుస్తున్న వర్షాలకు కాయలు పండిపోతాయని చెందుతున్నారు. సోమవారం మండలంలో 37 మి.మీ వర్షపాతం నమోదు అయింది. దీనికితోడు ఉదయం నుంచి ముసురు ఉండటంతో మామిడి కాయలు చెట్లకే పండి రాలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంతటితో ఆగి రెండు రోజులు ఎండకాస్తే మామిడి రైతు కోలుకుంటాడు. లేనిపక్షంలో కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ఈసారి ఎర్రమట్టి నేలలో కాపు తగ్గినా ఇసుక నేలలో ఆశించినంత కాపు వచ్చింది. అయితే, మరో రెండు రోజులు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే జరిగితే, ఇసుక నేలల్లోని మామిడికి పురుగు ఆశించే స్థాయి ఎక్కువగా ఉంది.

● సపోటాకు కొంతమేర నష్టం

వరుస కోతలు జరుగుతున్న ఈ సీజన్‌లో సగం సపోటా చెట్లపైనే ఉంది. ఈ వర్షంతో పెద్దగా నష్టం లేకున్నా రోజులు గడిచే కొద్ది పంటకొచ్చిన కాపు చెట్లపైనే పండి రాలిపోతుందని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.



కోతకు సిద్ధంగా ఉన్న మామిడి



కావలి : ట్రంకు రోడ్డుపై వర్షపు నీరు

షైనింగ్ స్టార్స్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక

- వివరాలు 8లో..

బాలింతలకు తీపి కబురు!

మళ్లీ అందుబాటులోకి బేబి కిట్లు

11 రకాల వస్తువులు అందజేయనున్న ప్రభుత్వం



నెల్లూరు (వైద్యం), మే 19 (ఆంధ్రజ్యోతి) : బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం తీయని కబురందించింది. ఎప్పుడో ఆరేళ్ల క్రితం ఆగిపోయిన బేబీకిట్లను తిరిగి పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం జీవో నెం.61 విడుదల చేసింది. ఒక్కో కిట్ విలువ రూ.1410 ఉండగా, జిల్లాలో ఏడాదికి 14 వేల ప్రసవాలు జరుగుతుండగా రూ.1.97 కోట్లు ఖర్చువుతుంది. 2016లో అప్పటి టీడీపీ సర్కారు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవించే గర్భవతులకు పుట్టే పిల్లల కోసం ఎన్టీఆర్ బేబికిట్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రులలో ఏడాదికి 14వేల ప్రసవాలు జరుగుతుండగా, అందరికీ ఈ కిట్లు అందేలా చర్యలు చేపట్టింది. అయితే, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ బీబికిట్లను వైఎస్సార్ బేబికిట్లుగా పేరు మార్చి బాలింతలకు అందజేసింది. అయితే, ప్రభుత్వం ఏర్పడిన తొలి 6 నెలల మాత్రమే కిట్లు అందజేసి, ఆ తర్వాత ఆపేసింది. దీంతో బాలింతలు తమ పురిటిబిడ్డల కోసం అవసరమైన సామగ్రిని బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వచ్చేది.

● కిట్‌లో 11 వస్తువులు..

గతేడాది అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలన్నీ నెరవేర్చుతూ వస్తోంది. అయితే, గతంలో టీడీపీ అమలు చేసిన ఎన్టీఆర్ బేబికిట్లను తిరిగి అమలులోకి తెచ్చేలా నిర్ణయం తీసుకుంది. దాదాపు 11 వస్తువులు ఉండే ఒక్కో కిట్ విలువ రూ.1,410 ఉంటుంది. నెల్లూరులోని జీజీహెచ్‌లో ప్రతి నెల 400 ప్రసవాలు జరుగుతుండగా, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులలోనూ, సామాజిక ఆరోగ్య కేంద్రాలలోనూ మరో 600లకుపైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకున్న ప్రతిబాలింతకు ఓ కిట్‌ను ఇవ్వనున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేదవర్గాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి.

కిట్లలో ఉండేవి..

బేబి కిట్లలో బేబి బెడ్, దోమతెర, టవల్ లిక్విడ్ సోప్, బేబి ఆయిల్, హ్యాండ్ బ్యాగ్, న్యాప్‌కిన్, పౌడర్, డైపర్, షాంపూ, బేబి సోప్, సోప్‌బాక్స్, చిన్న బొమ్మలు ఉంటాయి.

ఎంతో శుభపరిణామం

ఐదేళ్లకుపైగా పురిటిబిడ్డలకు బేబి కిట్‌లే రావడం లేదు. వైసీపీ ప్రభుత్వం కేవలం 6 నెలలు మాత్రమే కిట్‌లను ఇచ్చి ఆపేసింది. దీంతో బాలింతలపై ఆర్థిక భారం పడేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కిట్లు ఇవ్వనున్నట్లు జీవో జారీ చేయడం శుభపరిణామం. ఈ కిట్లు వస్తే ఎంతో మంది పేదవారికి ప్రయోజనం చేకూరుతుంది.

- డాక్టర్ నరేంద్ర,
జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

'మహా' సంబరం!

పండుగలా 'మినీ మహానాడు' ● సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కావలి, కందుకూరు, ఉదయగిరిలలో నిర్వహణ



వింజమూరు : యువతకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

నెల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ప్రధాన వేడుక అయిన మహానాడు కార్యక్రమానికి ముందు నిర్వహించే నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. సోమవారం ఒక్క రోజే ఐదు నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కావలి, ఉదయగిరిలలో మినీమహానాడుల సంబరం అంబరాన్ని తాకాయి. ప్రజాప్రతినిధులు, పార్టీ పదవుల్లో ఉన్న నాయకులతోపాటు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు ఈ కార్యక్రమాలకు తరలివచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఒకచోట చేరడంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావారణం కనిపించింది. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై తీర్మానాలు ఆమోదించారు. వెంకటాచలం మండలం చెముడుగుంట వద్దనున్న శ్రీడ్స్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు ఛైర్మన్ జడ్ శివప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ బోర్డు ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

● నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ నియోజకవర్గ మినీ మహానాడు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలు హాజరయ్యారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై 12 ప్రతిపాదనలను తీర్మానించారు.

● వింజమూరులోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో ఉదయగిరి నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు.

● కావలిలోని నారాయణ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే దగ్గుమాటి వెం కటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మినీ మహానాడు జరిగింది. తమ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు.

● కందుకూరులో జరిగిన మినీ మహానాడులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పలు అంశాలపై తీర్మానాలు చేశారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

శేష వాహనంపై ఆదిదంపతుల వైభోగం



బుచ్చిరెడ్డిపాళెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో జరుగుతున్న మల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి, అమ్మవారు శేష వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుచా ఉత్సవంలో ఆదిదంపతులు విహరించారు. ఈ సందర్భంగా అంతరాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● ఉత్సవాలలో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం పురుషామృగ వాహనంపై స్వామి అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

ఆపరేషన్ కోసం వస్తే ఆయువు తీశారు !

● కావలి పీపీ యూనిట్ వైద్యుల నిర్వాకం
● మృతురాలి బంధువుల ఆందోళన
● గుండెపోటుతోనే మృతి : డాక్టరు



కావలి ఏరియా ఆసుపత్రి వద్ద గుమికూడిన జనం

కావలి, కావలిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కోసం వచ్చిన మహిళ ఏకంగా ప్రాణాలనే పోగొట్టుకుంది. ఇందుకు కావలి ఏరియా వైద్యశాలలోని పీపీ యూనిట్ వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి కథనం మేరకు.. కావలి పట్టణం మద్దూరుపాడుకు చెందిన రావినూతల సునీత (35)కు 15 ఏళ్ల కుమార్తె అనంతరం గత నెల 15వ తేదీన మరో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇద్దరు పిల్లలు ఉండటంతో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకోవాలని 20 రోజుల కిందట పీపీ యూనిట్‌కు వస్తే అన్ని రకాల పరీక్షలు చేసి సోమవారం రమ్మన్నారు. దీంతో సునీత ఆసుపత్రికి రాగా ఆమెను నడిపించుకుని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకుపోతూ పొట్ట లావుగా ఉంది. మత్తు ఎక్కువ అవసరం అవుతోందని ఆశావర్కర్ ఉమ ద్వారా రూ.700 తీసుకుని మత్తు మందు తెప్పించారు. ఆపరేషన్ అయిన వెంటనే ఆమెను గదికి తీసుకురాగా సునీతలో కదలిక కనిపించలేదు. ఈ విషయమై బంధువులు అక్కడున్న సిబ్బందిని అడగగా మత్తు ఎక్కువైనందున అలా ఉందని చెప్పారు. ఎంతసేపటికీ ఆమెలో కదలిక లేకుండా శరీరం చల్ల పడుతుండటంతో మరోమారు సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో వారు ఆపరేషన్ చేసిన డాక్టర్ రజనీకి చెప్పి సెలైన్ కట్టేందుకు ప్రయత్నించగా అది ఎక్కలేదు. దీంతో సునీతను అత్యవసర వార్డులోకి తీసుకువెళ్లి కొంతసేపు తర్వాత మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో బంధువులు డాక్టర్‌ను నిలదీయగా గుండెపోటు వచ్చిందని చెప్పారు. మత్తు ఎక్కువగా ఇచ్చినందునే సునీత మృతి చెందిదంటూ బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడగా కావలి డీఎస్పీతోపాటు ఇద్దరు సీఐలు పోలీస్ సిబ్బంది పీపీ యూనిట్‌కు చేరుకుని, విచారించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి కూడా ఏరియా వైద్యశాలకు వచ్చి మృతురాలి బంధువులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



సునీత మృతదేహం

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మైనా రిటీ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ రుణాలకు ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడివో మారెళ్ల భవాని ఒక ప్రకట నలో తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు మే 25 చివరి తేదీ అని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9018
వెండి కిలో ధర	రూ. 98,100
వెండి ఒక గ్రాము	రూ. 101.10

రంగులరాట్నం ఏర్పాటుకు 26న వేలం పాట

విడవలూరు, మే 19(ఆంధ్రజ్యోతి): రామతీర్థం గ్రామంలో వెలసివున్న కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జూన్ నెలలో ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే వివిధ దుకాణాలు తదితర వాటికి రెండురోజుల క్రితం ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించారు. రంగులరాట్నం నిర్వహణకు ఏవరూ ముందుకు రాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. ఇలా వాయిదా వేసిన రంగులరాట్నానికి ఈనెల 26న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.50వేల ధరావత్తు చెల్లించాలని తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

మనుబోలు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనుబోలులో సోమవారం రెండు కేంద్రాలలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. తెలుగు పరీక్షకు రెండు కేంద్రాల్లో 19మంది గైర్హాజరయ్యారు. ఈ కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ సమగ్రశిక్ష అభియాన్ ఏఎంవో జీ సుధీర్‌బాబు, సిట్టింగ్ స్క్వాడ్ ఎంఈవో-2 ఏ.వి.రమేష్‌కుమార్ తనిఖీ చేశారు.

మూతపడిన ఎస్సీ హాస్టల్ పరిశీలన

వెంకటాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి గ్రామంలో గత వైసీపీ హయంలో మూతపడిన ఎస్సీ హాస్టల్‌ను సోమవారం జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎస్సీ హాస్టల్ గురించి పట్టించుకోకపోవడంతో మూతపడిందని విమర్శించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈ భవనం ప్రభుత్వానికి ఉపయోగపడే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, సుబ్రహ్మణ్యం, రహీమ్, అశోక్, మస్తాన్, చిన్న, రెహమాన్ తదితరులున్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

● ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ కరంచంద్

వెంకటాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతోనే విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ డీ కరంచంద్ అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో సోమవారం ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. అనంతరం వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, ఎన్‌సీసీ క్యాంపు అధికారి బాలబ్రహ్మాచారి, మస్తాన్‌వలి, పెంచల పుల్లయ్య, దీప్తి, హరీష్‌రెడ్డి, జయరాం, శ్రీపతిప్రసాద్, జావీద్ బాషా తదితరులున్నారు.

రూ.2.24 కోట్లతో కేజీబీవీ అభివృద్ధి

లింగసముద్రం, మే 19(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సుమారు రూ.2.24 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. మూడేళ్ల క్రితం ఈ విద్యాలయంలో ఇంటర్మీడియట్‌ను ప్రారంభించారు. దీంతో తరగతుల నిర్వహణ, వసతికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఇంటర్ విద్యార్థినుల కోసం డార్మెట్రీ, తరగతి గదుల నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం రూ.1,27,28,830 మంజూరు చేసింది. అలాగే నాడు-నేడు రెండవ విడత ఈ ప్రాంగణంలో చేపట్టి అసంపూర్తిగా నిర్మించిన 8 అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు మరో రూ.96 లక్షలు మంజూరు చేసింది. దీంతో మొత్తం రూ.2,23,82,830లతో చేపట్టనున్న పనుల కోసం టెండర్లు పూర్తికావడంతో కాంట్రాక్టరు అగ్రిమెంటు కూడా చేసుకున్నట్లు తెలిసింది. రూ.1,27,82,830లతో గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 తరగతి గదులు, మొదటి అంతస్తులో డార్మెట్రీ కోసం 3 గదులు న్మిర్మిస్తామని సమగ్ర శిక్ష అభియాన్ ఏఈ ఎస్ మస్తానయ్య తెలిపారు. అలాగే రూ.96 లక్షలతో అసంపూర్తిగా ఉన్న 8 అదనపు తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఇంకా అవకాశం ఉంటే కేజీబీవీ విద్యాలయం పైన 10 ఏళ్ల క్రితం అసంపూర్తిగా నిలిచిన గదుల నిర్మాణాలను కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ పనులను 9 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

● రాజధాని పనులు సత్వరం పూర్తి
● జిల్లాలో పుష్కలంగా సాగునీరు
● సర్వేపల్లి మినీ మహానాడులో మంత్రి ఆనం

వెంకటాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి పథంలో నడుపుతున్నారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న శ్రీడ్స్ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారథ్యంలో జరిగిన సర్వేపల్లి మినీ మహానాడుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రంలో గత ఐదేళ్లు ఇబ్బందులు పడ్డామన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఆ పరిస్థితి నుంచి బయట పడ్డామన్నారు. వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల్లో వీధి లైట్లు కూడా వేసుకోలేని పరిస్థితి ఉండేదని, నీటిపారుదల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. సోమశిల జలాశయం నుంచి గడిచిన ఐగేళ్లల్లో రబీ రెండవ పంటకు నీరు ఇచ్చిన దాఖలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది 5.60 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామన్నారు. రెండేళ్లలో సోమశిల హై లెవల్ కెనాల్స్ పూర్తి చేసి జిల్లాలోని



మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి, పక్కన సోమిరెడ్డి, దినేష్‌రెడ్డి తదితరులు

మెట్టప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి చేసిన అవినీతి, అక్రమాలకు తగిన శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. సర్వేపల్లిలో గత ఐదేళ్లలో ఎన్నో భూకుంభకోణాలు జరిగాయని విమర్శించారు. కాకాణి చేసిన పాపాలకు 12 మందికిపైగా జైలుకెళ్లారని, ఎంతోమంది అధికారులు, సిబ్బంది సస్పెండ్ అయ్యారన్నారు. కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని సోమిరెడ్డి హామీ ఇచ్చారు.

పండుగలా సర్వేపల్లి మినీ మహానాడు

సర్వేపల్లి ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంయుక్త సారథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు పండుగ వాతావరణంలో జరిగింది. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నేతలు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, డాక్టర్ జెడ్ శివప్రసాద్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, దావా పెంచలరావు, జెన్ని రమణయ్య, బొమ్మి సురేంద్ర తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● టీడీపీ మండల అధ్యక్షుడికి సన్మానం

కొడవలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని టీడీపీ మండల అధ్యక్షడు నాపా వెంకటేశ్వర్లునాయుడు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత నియోజకవర్గమే లక్ష్యంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం సిమెంటు రోడ్లు, సైడు కాలువలు, రైతులకు అవసరమైన చోట కల్వర్టులు నిర్మాణం, కాలువ పూడికతీత పనులు చేసి గ్రామీణ ప్రాంతాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధిపరుస్తున్నారన్నారు. నివేశ స్థలాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు లేని వారికి ఎమ్మెల్యే సహకారంతో త్వరలో అందజేయనున్నామన్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించాఆరు. ఆయన వెంట రాష్ట్ర నాయకులు జీవీఎస్.శేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పెన్నా డెల్టా చైర్మన్‌కి సన్మానం

విడవలూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పెన్నా డెల్టా చైర్మన్‌గా ఇటీవల ఎన్నుకున్న జెట్టి రాజగోపాల్‌రెడ్డిని సోమవారం నెల్లూరులోని ఇరిగేషన్ కార్యాలయంలో ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, నీటి సంఘాల అధ్యక్షులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, ఆవుల రవిచంద్ర, దూది విజయరాఘవన్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో త్వరలో వరినాట్లు ప్రారంభంకానున్నాయన్నారు. రైతులకు సాగునీటి విడుదలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఓగు నాగేశ్వరరావు, సత్యవోలు సత్యంరెడ్డి, ఎస్‌కె. రఫీ పాల్గొన్నారు.



పెన్నాడెల్టా చైర్మన్ రాజగోపాల్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న పాశం శ్రీహరిరెడ్డి

స్వర్ణభారత్ ట్రస్ట్‌కు 'తెలుగు వన్' స్ఫూర్తి పురస్కారం

● అందుకున్న దీపావెంకట్

వెంకటాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది యువతకు నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మహిళలకు సాధికారత, రైతులకు సహకారం, గ్రామీణ పేదల కోసం ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలకు మరో గుర్తింపు లభించింది. మొట్టమొదటి తెలుగు పోర్టల్ 'తెలుగు వన్' రజతోత్సవ వేడుకల్లో భాగంగా స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలకు స్ఫూర్తి పురస్కారాన్ని అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో జస్టిస్ ఎన్‌వీ రమణ, జీయర్ స్వామి నుంచి ఈ పురస్కారాన్ని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్ముడు కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు స్వర్ణభారత్ ట్రస్ట్‌ను మొదటగా వెంకటాచలంలో, విజయవాడ, హైదరాబాద్‌లో విస్తరించి సేవలు అందిస్తున్నామని చెప్పారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా లబ్ధి పొంది జీవితం నిలదొక్కుకున్న వారితోపాటు ట్రస్ట్‌కు సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి, స్వర్ణభారత్ ట్రస్ట్ స్ఫూర్తి ప్రదాత ముప్పవరపు వెంకయ్యనాయుడు మాటలను ఉటంకించిన ఆమె, పురస్కారాలు అనేవి తీసుకునే వారికి లభించే గుర్తింపు కాదని, ఆ స్ఫూర్తితో మరెంతో మంది సేవా మార్గంలో ముందుకు రావడమే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, శాసన సభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



స్ఫూర్తి పురస్కారాన్ని అందుకుంటున్న దీపావెంకట్

సుందరయ్యకు ఘన నివాళి

కోవూరు, మే 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు జక్కా శేషమ్మ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య సాగించిన పోరాట పటిమ ప్రపంచానికే మార్గదర్శకమైందన్నారు. పేదల పక్షాన పోరాడటంలో ఆయన చూపిన మార్గం నేటి నాయకులకు ఆచరణీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, పవ్వేటి మల్లికార్జునరెడ్డి, బట్టా పెద్దబ్బయ్య, గండవరపు విజయభాస్కర్, నూకలపాటి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సీపీఎం నాయకులు

సుందరయ్యకు నివాళి


మనుబోలు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనుబోలు, మడమనూరు, కాగితాలపూరు, చెర్లోపల్లి గ్రామాల్లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి తలారి దేవదానం, నాయకులు బీసీ భాస్కర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

కావలిలో తిరంగా ర్యాలీ

కావలి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సోమవారం రాత్రి కావలి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వ హించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గుర్రం పెట్రోల్ బంకు నుంచి ఐకాన్‌సెంటర్ వరకు వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలతో కలిసి ఈ ర్యాలీ కొనసాగించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతోపాటు ఆర్డీవో ఎం. సన్నీవంశీ కృష్ణ, డీఎస్పీ పీ.శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ పీ. శ్రావణ్ కుమార్, ఎమ్పీడీవో సీహెచ్. శ్రీదేవితోపాటు వివిధశాఖల అధి కారులు, మాజీ సైనికులు, ప్రజలు జాతీయ జెండాల తో జయహో భార త మాత అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే మా ట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రమూకలను సమర్థవంతంగా ఎదర్కొన్న ప్రధాన మంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన భారతీయులకు ప్రగాఢ సానుభూతిని తెలు పుతూ భారతీయుల యువత దేశరక్షణకు ముందుండాలన్నారు.



పెంచలకోనలో వర్షం



రాపూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో సోమవారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి ఆహ్లాదకరంగా మారింది. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, బ్రహ్మోత్సవాల అనంతరం వర్షం పడడం అనవాయితీ అని, దీన్ని ఎంగిల్ల వాన అని పిలుస్తామని పెంచలకోన ప్రధాన అర్చకులు శశి స్వామి తెలిపారు.

ఉపాధికి వసతుల కరువు

తోటపల్లిగూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కనీస వసతులు లేక ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. వేసవికాలంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఉపాధి పనులపైన ఆధారపడాల్సి వస్తోంది. ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించాలని ఆదేశాలున్నాయి. కానీ అధికార యంత్రాంగం ఈ లక్ష్యం చేరుకోవడంతో ప్రతి ఏటా విఫలమవుతున్నారు. కొన్ని కుటుంబాలకు మాత్రమే వంద రోజులు పని పరిమితమవుతోంది. పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేక ఉపాధి కూలీలు అవస్థలు పడాల్సి వస్తుంది. ముఖ్యంగా ఉపాధి పనులు చేసే కూలీలకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి. నిబంధనలు పాటించాలి. సేద తీరేందుకు నీడ కోసం టెంట్, తాగునీరు, ప్రాథమిక చికిత్స పెట్టెలు అందుబాటులో ఉండాల్సి ఉంది. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదని కూలీల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి.



తోటపల్లిగూడూరు మండలంలో 5063 జాబ్‌కార్డులు, 1900 మందికి కూలీలు పనిచేస్తున్నారు. కాగా, భగభగ మండుతున్న ఎండలకు కూలీలు విలవిలలాడుతున్నారు. ఇప్పటికీ వడదెబ్బతో పలువురు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో పలువురు కూలీలకు అస్వస్థతకు గురైన సంఘటనలు ఉన్నాయి. గతంలో ఉదయం 6గంటలకు పనికి వెళ్తే ఎండ తీవ్రత పెరగకముందే ఇంటికొచ్చేవారు. కానీ ఇప్పుడు ఉపాధి కూలీలు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు పనిచేయాల్సి వస్తుంది. నిబంధనలు పాటించడంలో అధికారులు పూర్తి వైఫల్యం చెందారని కూలీలు విమర్శిస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుదాఘాతానికి యువకుడి దుర్మరణం

వింజమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం జరుగుతున్న మినీ మహానాడుకు వచ్చి బస్టాండు సెంటర్‌లోని చిల్లర దుకాణం వద్ద విద్యుదాఘాతానికి గురై దుత్తలూరు మండలం భైరవరం గ్రామానికి చెందిన బోగిరెడ్డి చిన్నఓబుల్‌రెడ్డి (29) మృతి చెందారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి దుకాణం పైకప్పులకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ విషయం తెలియక చిన్నఓబుల్ రెడ్డి పైపును తాకగానే విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మహానాడు అనంతరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరామర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ పరంగా ఆదుకుంటామని తెలిపారు.



చిన్న ఓబుల్‌రెడ్డి మృతదేహం

వృద్ధుడి అనుమానాస్పద మృతి

సంగం, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరపనాయుడు కండ్రికలోని ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటున్న ఓ వృద్ధుడు సోమవారం కాలువ నీటిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... నెల్లూరుకు చెందిన కిలారి రామానాయుడు (80) గత కొన్ని నెలల నుంచి ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు అప్పుడప్పుడు బయటకు వెళ్లి తిరిగి వస్తుంటారు. ఈక్రమంలోనే కిలారి రామానాయుడు ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం అయినా రాకపోవడంతో నిర్వాహకులకు అనుమానం వచ్చి ఆశ్రమం పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. సమీపంలోని కనిగిరి ప్రధాన కాలువ గట్టు వద్ద వృద్ధుడు వాడే కర్ర ఉండడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఇరిగేషన్ అధికారులతో కాలువ గేట్లు మూసేసి నీటి విడుదలను తగ్గించారు. సాయంత్రం వృద్ధుడి మృతదేహం కాలువలో తేలడంతో గట్టుకు చేర్చారు. అనంతరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆత్మకూరు వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..

నెల్లూరు(క్రైం), మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొదలకూరు రోడ్డులో గల ఎస్పీ బంగ్లా ప్రహరీగోడ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 94407 00018, 94403 33191 నెంబర్లకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ శివారులోని గండిపాళెం మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన బొమ్ము మౌలాలీ బైక్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా జాతీయ రహదారి సర్కిల్ ప్రాంతానికి రాగానే కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన మౌలాలీని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడ్డ మౌలాలి

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల స్వాధీనం



పట్టుకున్న వాహనంతో పోలీసులు

సంగం, మే 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న నాలుగు వాహనాలను మండలంలోని దువ్వూరు వద్ద ఆదివారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. దువ్వూరు సమీపంలో అరవపాళెం, అన్నారెడ్డిపాళెం, మక్తాపురంలోని చేపల చెరువులకు మేతగా తరలిస్తుండగా పోలీసులుదాడిచేసి పట్టుకునారు. ఈ వాహనాల్లో సుమారు 45 డమ్ములు ఉన్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి చికెన్ వ్యర్థాలను సంగం కొండ ప్రాంతలో గుంతలు తీసి పూడ్చివేశారు. వాహనదారులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుప్తనిధుల ముఠా సభ్యుడి పట్టివేత

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాల ముఠా సభ్యుడిని అటవీ శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా తెలిపిన వివరాల మేరకు.. గత కొన్ని రోజులుగా ఉదయగిరి దుర్గంపై గుప్తనిధుల తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ క్రమంలో సోమవారం వరికుంటపాడు మండలం తూర్పుబోయమడగల ఎస్సీ కాలనీకి చెందిన నల్లు అశోక్, మర్రిపాడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రమేష్, గోపిలు దుర్గం కొండపై గుప్తనిధుల తవ్వకాల కోసం వెళుతున్నారన్నారు. వారు మండలంలోని బండగానిపల్లి అటవీ ప్రాంతం నుంచి రాణిబావి వెయ్యి మెట్ల మార్గం గుండా భోజన సామాగ్రితో దుర్గంపైకి వెళుతుండగా తమ సిబ్బంది పట్టుకునే ప్రయత్నం చేయగా రమేష్, గోపిలు పరార్ కాగా, నల్లు అశోక్ సిబ్బందికి చిక్కాడన్నారు. అతడిని రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. మంగళవారం పూర్తిస్థాయిలో విచారించి కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో ఎఫ్‌ఎస్‌వో చినవెంకటయ్య, ఎఫ్‌బీవోలు లక్ష్మీప్రసన్న, భానుతేజ, వెంకటేశ్వర్లు, బేస్‌క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అదుపులోకి తీసుకున్న వ్యక్తితో అటవీ అధికారులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100):	550

కమనీయం శ్రీవారి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం) : బాలాజీనగర్ సీతారా మ మందిరంలో సోమవారం శ్రీదే,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిగింది. ఉదయం స్వామి వార్లకు పంచామృతాభిషేకాలు జరిగాయి. ఉభయకర్తలుగా గుర్రం బ్రహ్మానందం కుటుంబం వ్యవహరించింది. ఈ కార్యక్రమాలను ధర్మకర్తల మండలి చైర్మన్ తానే మస్తాన్‌రావు, కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశా ధికారి కే. శివప్రసాద్, త్యాగరాజస్వామి కల్యాణ మండపం చైర్మన్ అమరా మోహ న్‌రావు, కోశాధికారి హనుమంతరావు, ప్రధాన అర్చకులు బృందావనం శ్రీనివాస దీక్షితులు పర్యవేక్షించారు.



మంగళసూత్రాలు చూపుతున్న అర్చకుడు

న్యూస్ బాక్స్

మదనపల్లె పోలీసుల వైఖరికి నిరసన

నెల్లూరు (సాంస్కృతికం) మే 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో శనివారం నిర్వహించిన హనుమాన్ ర్యాలీలో నేతల అరెస్టులను బీజేపీ నేత మిడతల రమేష్ తీవ్రంగా ఖండించారు. సోమవారం నగరంలోని మూలాపేటలో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ హెల్మెట్లు ధరించి ర్యాలీ చేయాలని ఆంక్షలు విధించడం దారుణమన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరుగాళమ్మ హుండీల ఆదాయం రూ.7.53లక్షలు



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో ఉష, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుగాళమ్మ ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు జరిగింది. 2024ఫిబ్రవరి 12 నుంచి 2025 మే 19 వరకు భక్తులు వేసిన కానుకలు లెక్కించగా రూ.7,53,600ల ఆదాయం లభించింది. నగదుతోపాటు బంగారం 69.100 మి.గ్రా, అమెరికన్ డాలర్లు 5 లభించాయి. హుండీల లెక్కింపును వెంగమాంబ పేరంటాళ్ల ఆలయ ఈవో వీ.ఉష పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో వీ.గిరికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, సభ్యులు వీ.జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటం బహూకరణ



మోదీ చిత్రపటాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(క్రైం), మే 19 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామ్ ప్రసాద్‌ను నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని రీజనల్ కార్యాలయంలో బీజేపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రధాని మోదీ చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, నేతలు తోట సుబ్రహ్మణ్యం నాయుడు, చట్టగుండ్ల సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌రాజు మృతి



నెల్లూరు (సాంస్కృతికం) మే 19 (ఆంధ్రజ్యోతి): అన్నమాచార్య ఆరాధన సమితి అధ్యక్షుడు కేవీ. సుధాకర్‌రాజు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో స్వర్గస్తులయ్యారు. తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు సహకారంతో ఆయన పలుమార్లు అన్నమాచార్య ఆరాధనోత్సవాలు నిర్వహించారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న అన్నమాచార్య విగ్రహం ఏర్పాటులో ఆయన పాలుపంచుకున్నారు. ఆయన మరణం ఆధ్యాత్మిక, కళారంగాలకు తీరని లోటని అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. 25 కళా సంఘాల కళాకారులు కూడా ఓ ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కందుకూరు నుంచి శ్రీశైలానికి ఆర్టీసీ బస్సు

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు నుంచి శ్రీశైలంకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ సర్వీస్‌ను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా బసు నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన సర్వీస్‌లను ప్రారంభించటం జరుగుతోందని, శ్రీశైలంకు నడుపుతున్న ఆర్టీసీ సర్వీస్‌ను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ నూతన సర్వీస్ ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆర్టీసీ అధికారులు, తెలుగునాడు ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు ఘన స్వాగతం పలికారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు



నెల్లూరు (లీగల్), మే 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికలకు మంగళవారం నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కా నుంది. ఈ ఎన్నికలు జూన్ 20న జరగనున్నాయి. బార్ అసోసియేషన్‌లో 2507 మంది న్యాయవాదులు సభ్యులుగా ఉన్నారు. అయితే బార్ కౌన్సిల్ పంపిన ఓటర్ల జాబితా ప్రకారం అరి యర్స్ కట్టని వారి పేర్లు పోను మిగతా ఓటర్ల సంఖ్య 1,362గా ఉంది.అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ట్రెజరర్,లైబ్రరీ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లేడీ రెప్రజంటేటివ్, ముగ్గురు సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, ఐదుగురు జూనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో ప్రధానంగా మూడు ప్యానళ్లు పోటీలో ఉన్నాయి. వేనాటి ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి పులిమి అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్ష పదవికి ఈదూరు భాస్కరయ్య, ప్ర ధాన కార్యదర్శి పదవికి నక్కల నాగరాజు, సం యుక్త కార్యదర్శి పదవికి కేఎల్. నారాయణ పోటీలో ఉన్నారు ఐక్యవేదిక ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి వేళ్ల ఉపేంద్రరావు, ఉపాధ్యక్ష పదవికి జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి పదవికి ఎస్. అంకయ్య, సం యుక్త కార్యదర్శి పదవికి నాగేళ్ల రవికృష్ణ బరిలో ఉన్నారు. జాతీయ న్యాయవాద వేదిక నుంచి అధ్యక్షపదవికి దాసరి రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్ష పదవికి బీఎస్. రంగరాజన్, ప్రధాన కార్యదర్శి పదవికి సీహెచ్.నవీన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పదవికి టీ. బాబురెడ్డి పోటీలో ఉన్నారు. మిగతా పదవులకు కూడా అత్యధిక సంఖ్యలో న్యాయవాదులు పోటీ పడుతున్నారు. న్యాయవాదులు తమ గెలుపు కోసం గత 20రోజులుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ సారి ముక్కోణపు పోటీ జరగనుండడంతో పోరు రసవత్తరంగా మారింది. నామినేషన్ల పర్వం పూర్తయిన వెంటనే ప్రచారం మరింతగా ఊపందుకోనున్నది. కోర్టుకు వేసవి సెలవులు ఉన్నా, న్యాయవాదుల ఎన్నికలతో సందడి నెలకొంది. ఎన్నికల అధికారులుగా సీనియర్ న్యాయవా దులు బీ. శ్రీనివాసన్, సీవీ.రత్నం వ్యవహరిస్తున్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉందాం

● కష్టపడే కార్యకర్తలకు ఎప్పటికీ గుర్తింపు ● రూరల్ మినీ మహానాడులో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మినీ మహానాడులో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, మే 19, (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మనమంతా జవాబుదారీగా ఉందామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల నివాళులు అర్పించారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో అశువులు బాసిన అమరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నాయకత్వం ప్రజలకు దగ్గరగా ఉన్నప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. రూరల్లో పార్టీకోసం కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. కష్టపడే వ్యక్తి ఎక్కడున్నా తానే స్వయంగా వెళ్లి పదవులు అందచేస్తామన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, వాటిల్లో నూటికి నూరు శాతం విజయం సాధించాలని కోరారు. రూరల్ ప్రజలు తనను ఎమ్మెల్యేగా కాకుండా వారి కుటుంబ సభ్యుడిగా చూస్తున్నారని పేర్కొన్నారు. కాగా కడపలో ఈనెల 27 నుంచి జరిగే మహానాడుకు రూరల్ మినీ మహానాడు నుంచి 12 తీర్మానాలు పంపుతున్నట్లు శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్ రెడ్డి, నాయకులు భానుశ్రీ, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, జెన్ని రమణయ్య, వెంకటేశ్వ ర్లురెడ్డి, ప్రదీప్, జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్, సికిందర్‌రెడ్డి కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

‘పుచ్చలపల్లి’కి ఘన నివాళి

● పలు డివిజన్లలో సేవా కార్యక్రమాలు



నగరంలోని జీజీహెచ్‌లో రక్తదానం చేస్తున్న మెడికల్ యూనియన్ ఉద్యోగులు



బుజబుజనెల్లూరులో మజ్జిగ పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు



మాదరాజు గూడూరులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం) మే 19 (ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కనక మహల్ సెంటర్‌లో ఉన్న సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమేష్‌తోపాటు జిల్లా నేత చంద్ర రాజగోపాల్ తదితరులు మాట్లాడారు. అలాగే బుజబుజనెల్లూరులో కూడా సుందరయ్య వర్ధంతి వేడుకలు జరిగాయి. నెల్లూరు రూరల్ మండల సీపీఎం కార్యదర్శి కొండా ప్రసాద్ సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు కూడా సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ ఆధ్వర్యంలో కనకమహల్ సెంటర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదుపరి సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు అజయ్‌కుమార్, గోగుల శ్రీనివాసులు, పెంచలనర్సయ్య, మాలకొండయ్య, కృష్ణమూర్తి, వెంకయ్య, శ్రీనివాసులు, తిరుపతి, జగదీష్ పాల్గొన్నారు.

● జీజీహెచ్‌లో రక్తదానం

ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జీజీహెచ్‌లోని రక్తనిధిలో రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఏసీసుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా ప్రారంభించారు. అనంతరం యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ మాట్లాడుతూ పేద రోగులకు, గర్భిణులకు రక్తం అవసరం ఎంతో ఉందన్నారు. అందుకే రక్తదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కే. శ్రీనివాసులు, షేక్ సంధానిబాషా, డాక్టర్ సింధూజ, మనోజ్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు రూరల్‌లో....

నెల్లూరురూరల్, మే 19,(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురష్కరించుకుని సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘననివాళి అర్పించారు. మండలంలోని పొట్టేపాళెంలో మాజీ ఎంపీపీ చంద్రమౌళి, వెల్లంటిలో పార్టీ మండల కార్యదర్శి జనార్ధన్, సౌత్‌మోపూరు, ములుముడి, మాదరాజుగూడూరు, మట్టేంపాడు, దొంతాలి, సజ్జాపురం గ్రామాల్లో పుచ్చలపల్లి చిత్రపటానికి పలువురు నాయకులు పూల మాలలువేసి జోహార్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెత్తందారీ వ్యవస్థ, జాగీరుతనానికి వ్యతిరేకంగా సుందరయ్య ఎన్నో పోరాటాలు నిర్వహించి, ఎందరికో విముక్తి కల్పించారని తెలిపారు.

బ్రిడ్జే బారు !

● అసాంఘికాలకు అడ్డాగా సౌత్ రైల్వే స్టేషన్
● చీకటి పడితే ప్లాట్‌ఫాంపై కుప్పలుగా మద్యం సీసాలు
● భయపడుతున్న ప్రయాణికులు



నగరంలోని సౌత్ రైల్వే స్టేషన్



ఫుట్‌వోవర్ బ్రిడ్జిపై మద్యం సీసాలు



నెర్రెలు బారిన ప్లాట్‌ఫాం, ఆపై పిచ్చిమొక్కలు

నెల్లూరు(క్రైం), మే 19 (ఆంధ్రజ్యోతి) : నగర నడిబొడ్డున ఉన్న సౌత్ రైల్వే స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే మద్యం ప్రియులు, గంజాయి సేవించే వారు ఈ స్టేషన్‌ను అడ్డాగా మార్చు కుంటున్నారు. ఇక్కడి ప్లాట్ ఫాంలు, ఫుట్‌వోవర్ బ్రిడ్జి బార్లుగా మారిపోతు న్నాయి. వాటిపై మద్యం సీసాలు, గ్లాసులు, కండోమ్ ప్యాకెట్లు కుప్పలుగా కనిపిస్తున్నాయి. ఈ స్టేషన్ నుంచి వందలాది మంది రోజూ ప్రయాణాలు చేస్తుంటారు. అయినా పరిశుభ్రత, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణను ఎవరూ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ప్లాట్‌ఫాంలు నెర్రెలు బారి, పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా కనిపిస్తున్నాయి. పోలీసులు రాత్రి పూట విజిల్ వేసుకుంటూ వెళిపోతున్నారే తప్ప స్టేషన్‌పై ప్రత్యేక నిఘా ఉంచకపోతుండటంతో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రైల్వే అధికారులు, పోలీసులు సౌత్‌రైల్వే స్టేషన్ పై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జలదంకిలో భారీ వర్షం

జలదంకి, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. సాగులో ఉన్న పలు రకాల పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయాన్నే రైతులు పొలాల్లోకి వెళ్లి ఆరుతడి, మెట్టపంటల్లో నిలిచిన వర్షపునీటిని బయటకు పంపించారు. పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు మాత్రం ఈ వర్షం వల్ల కొంత మేర నష్టం ఉంటుందని రైతులు అంటున్నారు.

ప్రభుత్వ భూముల జోలికెళ్లొద్దు



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ హెచ్చరించారు. సోమవారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సిటీ నియోజకవర్గ పార్టీ నేతలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి తీసుకుని వాటిని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామన్నారు. నిబంధనల ప్రకారం అనర్హుల రేషన్ కార్డులను మాత్రమే తొలగిస్తామని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని నారాయణ తెలిపారు. పార్కులు, పాఠశాలల పనులు రానున్న పదిరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నగరంలో డ్రైన్ల పనులను త్వరలో ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అనురాధ, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలను కూల్చుతాం



రోడ్డుకు కొలతలు వేయిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మే 19,(ఆంధ్రజ్యోతి) : నగరంలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలన్నింటినీ కూల్చుస్తామని ఎన్ఎంసీ కమిషనర్ వైవో నందన్ స్పష్టం చేశారు. సోమవారం 17వ డివిజన్ పరిధిలోని చిల్డ్రన్స్ పార్కు, అపోలో కూడలి వద్ద ఆక్రమిత రోడ్లు, స్థలాలు, భవనాల అనుమతులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భవనాలకు తీసుకున్న అనుమతులు, పన్ను విధించేటప్పుడు వేసే కొలతలకు వ్యత్యాసం ఉండకూడదన్నారు. రీసర్వే ద్వారా పన్ను సవరణలు జరగాలని స్పష్టం చేశారు. రోడ్లను ఆక్రమించి, ఎలాంటి భవనాలు నిర్మించినా కూల్చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీసీ చెన్నుడు, ఎంహెచ్‌వో చైతన్య తదితరులు పాల్గొన్నారు. కాగా 39వ డివిజన్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు.

22వ రోజుకు సీహెచ్‌సీల సమ్మె



సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు

నెల్లూరు (వైద్యం) మే 19 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ అఫీసర్ల అసోసియేషన్ నాయకులు చేస్తున్న సమ్మె సోమవారానికి 22వ రోజుకు చేరాయి. వర్షంలోనూ సమ్మె కొనసాగుతుంది. ఈ సందర్భంగా సీహెచ్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు భాను మహేష్ మాట్లాడుతూ 22 రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించ పోవటం అన్యాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,032 మంది ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వ చర్చలకు పిలవకపోవటం అన్యాయమన్నారు. ఈ సమ్మెలో ఎంతోమంది గర్భిణులు, బాలింతలు పాల్గొంటున్నా ప్రభుత్వం స్పందించలేదన్నారు. అధికారులు వాస్తవాలు తెలుసుకుని తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు ఆదిల్ ప్రియాంక, రోజ్ మేరి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాల ప్రారంభం



శబరి శ్రీరామక్షేత్రంలో నిర్వహించిన అంకురార్పణ పూజలు

నెల్లూరు (సాంస్కృతికం) మే 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ నెల 22వతేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. అర్చకులు నరేష్‌స్వామి ఆధ్వర్యంలో తొలుత విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా బ్యాండు కచేరి, ప్రత్యేక అలంకారం దర్శనం, నివేదన, హారతులు జరిగాయి. ఈ సందర్భంగా విజయవాడ హనుమదీక్షా పీఠం భక్తులు చేపట్టిన 72గంటల అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ముగియడంతో వారికి ఘన సత్కారం జరిగింది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులను అలరించాయి.

మరమ్మతులకు నోచని చేతి పంపులు!

● ప్రజలకు తప్పని అవస్థ ● శ్మశాన వాటికల్లోనూ మంచినీటికి ఇక్కట్లు



రామస్వామిపాలెం శ్మశాన వాటికలో పనిచేయని చేతిపంపు

బిట్రగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు ప్రాంతాల్లో చేతి పంపులు మరమ్మతులకు గురవడంతో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శ్మశాన వాటికల్లో ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుని ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఉప్పు, జవ్వనీటి కారణంగా బోరు, లోపల పైపులు దెబ్బతిన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని శ్మశానవాటికలో చేతిపంపు మరమ్మతులకు గురై ఏడాది కాలం గడుస్తున్నా పట్టించుకున్నే నాథుడు లేడు. గ్రామస్థులు కర్మ క్రతువులు చేసుకోవాలంటే నీరు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. రామస్వామిపాలెంలోని దళిత, గిరిజన కాలనీ వాసులే కాకుండా విశ్వనాథరావుపేటలోని కొన్ని కుటుంబాలకు సంబంధించిన శ్మశాన వాటికలో చేతి పంపే ఆధారం. అది మరమ్మతులకు గురై ఆరు నెలలు కావస్తున్నా అధికారులు పంటించుకోలేదు. ఓ పక్క మండుతున్న ఎండలు, మరో పక్క పనిచేయని చేతిపంపులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి నెలకొంది. బోగోలు పాతహరిజనవాడలో బోరు మరమ్మతులకు గురవడంతో స్థానికులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదు. దీంతో ఆ చేతిపంపు శిథిలావస్థకు చేరింది. అదే విధంగా విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామ శ్మశాన వాటికలో చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో కర్మక్రతువులు చేసుకునేందు వచ్చిన వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు కొందరు రాజకీయ నేతల అండతో ప్రజలను లెక్కచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ప్రజల పట్ల కొందరు మండల అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని స్థానికులు తెలిపారు. శ్మశాన వాటికల్లో చెడిపోయిన చేతిపంపులకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

జాతీయ స్కేటింగ్‌లో జిల్లాకు పతకాలు



ర్యాంకు సాధించిన నందని (మధ్యలో అమ్మాయి)

నెల్లూరు(విద్య), మే 19 (ఆంధ్రజ్యోతి) : కేరళలో జరుగుతున్న జాతీయ స్థాయి ఓపెన్ ర్యాంకింగ్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన చిన్నాబత్తిన నందని 8వ ర్యాంక్ సాధించినట్లు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, కే.కామేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 15 ఏళ్లలోపు విభాగంలో 1500 మీటర్ల విభాగంలో బంగారుపతకం, వెయ్యిమీటర్ల విభాగంలో వెండిపతకం, 500 మీటర్ల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారిణిని వారు అభినందించారు.

రేషన్ బియ్యం కోసం మహిళల నిరసన


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

సీతారామపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుగారికాలనీ, కురవవీధి, రజక కాలనీ, తోటకాలనీలో ఎండియం వాహనం ద్వారా రేషన్ సరుకులను ఇవ్వడంలేదని సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట మహిళలు నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు.

సోమశిలకు 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 150 క్యూసెక్కుల వరద నీరు చేరింది. పెన్నా క్యాచ్‌మెంట్ పరిధిలో కురిసిన వర్షానికి ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు గుర్తించారు. నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 45.977 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

జమున స్ఫూర్తికి నమూనా

కళాకారిణిగా, క్రీడాకారిణిగా, రచయిత్రిగా విభిన్న రంగాల్లో ఏకకాలంలో రాణిస్తున్నారు కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని ఎం జమున. ఆరు పదులు దాటిన వయసులోనూ అంతులేని ఉత్సాహంతో ఆటల పోటీల్లో పాల్గొంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. దేశవిదేశాల్లో జరిగిన క్రీడల్లో రాణిస్తూ పతకాలు, పురస్కారాలు సొంతం చేసుకున్నారు. రచయిత్రిగా ఎన్నో వేదికలపై తన సాహితీ ప్రతిభను చాటడమేకాదు నృత్య కళాకారిణిగా ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శనలిచ్చి శభాష్ అనిపించుకున్నారు. వయసు శరీరానికేగానీ మనసుకు కాదని నిరూపిస్తున్నారు ఈ నిన్నటితరం టీచరమ్మ



ప్రతిభ

- బహుముఖ ప్రజ్ఞాశాలి
- కళా, క్రీడా, సాహితీ రంగాల్లో ప్రతిభ
- జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు
- 65 ఏళ్ల వయసులోనూ అలుపెరగని ఉత్సాహం
- స్ఫూర్తిదాయకంగా టీచరమ్మ సేవలు


చంద్రబాబు నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న జమున

కావలిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్మీలో హవాల్దార్‌గా పనిచేసే మొగిలిశెట్టి సుందరరావు, రంగనాయకమ్మ దంపతుల కుమార్తె జమున. తండ్రి జమ్మూలో పనిచేసేటప్పుడు అక్కడే పుట్టారు. చిన్న వయసులో వివాహం జరగడం, అనతి కాలంలోనే భర్త మరణించడంతో జమున తల్లితండ్రుల వద్దే పెరిగారు. బాల్య వివాహంతో ఆగిపోయిన విద్యను తండ్రి ప్రోత్సాహంతో కొనసాగించి ఎంఏ, ఎంఈడీ పూర్తి చేశారు. ఆ తర్వాత కావలి విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరారు. అంతేకాదు ఉన్నత విద్యను అభ్యసించే సమయంలోనే కళలు, క్రీడల్లోనూ రాణించారు. రచనా వ్యాసంగానికి పదునుపెట్టి అనేక జాతీయ స్థాయి పోటీల్లో రచయిత్రిగా విజయం సాధించారు.

● అంతర్జాతీయ క్రీడాకారిణిగా...

65ఏళ్ళ వయస్సు మీదపడినప్పటికీ జమున ఇప్పటికీ వివిధ దేశాల్లో జరిగే అంతర్జాతీయ వెటరన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. హేమర్‌త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్ తదితర అంశాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఢిల్లీ, తమిళనాడు, పంజాబ్, మణిపూర్, డెహ్రాడూన్, వడోదర, త్రివేండ్రం వంటి నగరాల్లో జరిగిన జాతీయ పోటీలతోపాటు మలేషియా, సింగపూర్, స్పెయిన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో నిర్వహించి న అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి 58 బంగారు, 30 కాంస్య పతకాలు సాధించారు. ఫిన్లాండ్ వరల్డ్ స్పోర్ట్స్ మీట్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి అర్హత సాధించిన ఏకైక మహిళగా గుర్తింపు పొందారు.

● కూచిపూడిలో ప్రతిభ

కూచిపూడి తాండవ నృత్యంలో జమున ప్రతిభను చాటారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో తిరుమల తిరుపతి దేవస్థానం, కాణిపాకం, కూచిపూడి గ్రామం (గోదావరి జిల్లా) నాసిక్, వాడపల్లి రాజమండ్రి, తదితర ప్రాంతాల్లో నృత్య రూపకాలు ప్రదర్శించారు. జైజవాన్ కల్చరల్ అకాడమీని స్థాపించి చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. శిష్యబృందంతో అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలిచ్చి ప్రముఖుల అభినందనలు అందుకున్నారు.

● సామాజిక సేవలోనూ..

రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యురాలిగా సంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో జమున విస్తృతంగా పాల్గొంటారు. రక్తదాన శిబిరాలు, విపత్తు సహాయక కార్యక్రమాల్లో సేవలు అందిస్తుంటారు. రెడ్‌క్రాస్ జాతీయ కౌన్సిలర్‌గా అమృత్‌సర్, ఒడిశా, హైద్రాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహిం చిన శిబిరాల్లో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు జన విజ్ఞాన వేదిక ద్వారా ప్రజా చైతన్య కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ఉంటారు. ప్రజల్లో మూఢ నమ్మకాలు పారద్రోలేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రశంసలు, పురస్కారాలు

- 2012 అనంతపురంలో జరిగిన రికార్డ్స్ కవి సమ్మేళనంలో పాల్గొని ఉత్తమ కవిగా అవార్డు పొందారు.
- 2017 కరీంనగర్‌లో కృషి కవిత ఆధ్వర్యంలో 1000 మంది కవులతో జరిగిన ప్రపంచ కవి సమ్మేళనంలో పాల్గొని బహుమతి సాధించారు.
- 2018లో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సదస్సులో ఉత్తయ రచయితగా అవార్డు పొందారు.
- కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరిగిన జాతీయ సహస్ర కవి సమ్మేళనం లో ప్రతిభ కనబరచడంతో అప్పటి డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ నుంచి పురస్కారం అందుకున్నారు.
- తిరుపతిలో చదవలవాడ రమణమ్మ విభిన్న రంగాల ప్రతిభావం తుల జాతీయ ఉత్తమ మహిళ అవార్డును సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ నుంచి అందుకున్నారు.
- మూడు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ అవార్డ్స్, మూడు సార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు.


నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందంతో జమున



తానా ఉత్సవాల్లో పురస్కారం అందుకుంటూ...

యువతలో సేవాభావం ఉండాలి

విలువలతో కూడిన విద్యతోపాటు యువత సేవాభావం కలిగి ఉండాలి. సమాజంలో అందరూ బాగుండాలన్న సంకల్పంతో ముందుకు సాగాలి. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. జీవితంలో కష్టసుఖాలు సహజం. ఆటుపోట్లను ఎదుర్కొని క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి. మనదగ్గరున్న విద్య, కళతో సమాజానికి ఏదైనా చేయాలన్న తపన ఉండాలి.

- జమున

ఆలిండియా ఓపెన్ చెస్ విజేత శ్యామ్

నెల్లూరు(విద్య), మే 19 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఓపెన్ చెస్ పోటీల్లో చెన్నైకి చెందిన ఆర్.శ్యామ్ చాంపియన్‌గా నిలిచాడు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీల ఆధ్వర్యంలో నగరంలోని గొలగమూడి రోడ్డులో గల ఫన్ పార్క్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్, ర్యాంకింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో చెన్నైకు చెందిన ఆర్.శ్యామ్ ప్రథ మస్థానం, గుంటూరు చెందిన డీ.ధృవేష్ ద్వితీయస్థానం, విజయవాడకు చెందిన వీ.అభిరామ్ తృతీయస్థానం సాధించారు. అలాగే తమిళనాడుకు చెందిన ఆకాష్ నాలుగో స్థానం, విజయవాడకు చెందిన శివపవన్‌తేజ ఐదో స్థానం సొంతం చేసుకున్నారు. ఫన్‌పార్క్ ఎండీ సాయి పొత్తూరి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, ఫన్‌పార్క్ ఈడీ సంయుక్త, జేసీఐ ప్రతినిధులు మోహన్ కిషన్, దిశ, మహాలక్ష్మి, ప్రమోద్‌కుమార్, శ్రీఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపీనాథ్, టోర్నీ నిర్వాహకులు డాక్టర్ మధుసూదన్, ఎం.సుమంత్, తదితరులు పాల్గొన్నారు.


చెస్ పోటీల విజేతలతో టోర్నీ నిర్వాహకులు

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

● పొలాల్లో కారు వదిలి డ్రైవర్ పరార్


వీర రాఘవయ్య మృత దేహం

కలిగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం వద్ద కలిగిరి-సంగం రహదారిపై సోమవారం కారు ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన కాపా వీరరాఘవయ్య(65) దుర్మరణం చెందాడు. గ్రామస్థుల వివరాల మేరకు.. వీరరాఘవయ్య కలిగిరి నుంచి పనులు ముగించుకొని కూరగాయలు సామానులు తీసుకొని బస్సులో గ్రామం వద్ద దిగాడు. బస్సు ముందుకు వెళ్లగా రోడ్డు దాటి గ్రామంలోకి వచ్చేక్రమంలో ఈమార్గంలో సంగం నుండి కలిగిరివైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈఘటనలో వీరరాఘవయ్య తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని గమనించిన గ్రామస్థులు కారును వెంబడించడంతో కారులో ఉన్న వ్యక్తి తప్పించుకునే ఉద్దేశ్యంతో కలిగిరి శివార్లలోని పొగాకు బోర్డు సమీపంలో పొలాలవైపు వెళ్లడంతో కారు బురదలో కూరుకుపోయింది. గ్రామస్థులు కారు దగ్గరకి వచ్చేలోపు కారులో ఉన్న వ్యక్తి పరారయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ ఉమాశంకర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అదుపు తప్పి బోల్తా పడిన ట్రాక్టర్

ముగ్గురికి గాయాలు

సీతారామపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన పోరుమామిళ్ల- సీతారామపురం ఘాట్ రోడ్డు జాతీయరహదారిపై సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... సీతారామపురం మండలం నుంచి దిబ్బ ఎరువు లోడుతో టేకూరుపేటకు బయలుదేరిన ట్రాక్టర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా ట్రాలీ రిమ్ము విరగడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్లో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

కార్డు కష్టాలు!

● చేయితడిపితేనే పని? ● లేకపోతే ప్రదక్షిణలే!

నెల్లూరు (హరనాథపురం), మే 19(ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా...పూజారి కరుణించనట్టు తయారైంది కొత్త రైస్ కార్డుల మంజూరు పరిస్థితి. ప్రభుత్వం కొత్తరైస్ కార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించిన తరువాత ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. అంతలోనే ఆన్‌లైన్, ధ్రువపత్రాల సమర్పణ కష్టాలతో ఆ ఆనందం ఆవిరైపోతోంది. పేద కుటుంబాలకు కొండంత అండ రేషన్ కార్డు. సంక్షేమ పథకాలు పొందాలంటే ఆ కార్డు తప్పని సరైంది. కొత్త రైస్ కార్డు దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో తప్పుల తడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవటంతో ప్రజలకు తిప్పలు తప్పటం లేదు. అందులో కుటుంబ సభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకపోతే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావటం లేదు. దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు సేకరించటం ప్రజలకు అతి కష్టంగా మారింది.

ధ్రువీకరణ పత్రాలతో చిక్కులు

ప్రభుత్వం కొత్తరైస్ కార్డు జారీకి అర్హత ప్రమాణాలు, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాలని పేర్కొంది. దరఖాస్తు దారు కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.2 లక్షలలోపు ఉండటంతోపాటు ఆరు దశల ప్రమాణాలను కలిగి ఉండాలని స్పష్టం చేసింది. గ్రామ వార్డు సచివాలయాల్లో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కావటంతోపాటు కుటుంబ సభ్యులలో ఎవరికీ రైస్‌కార్డు ఉండకూడదని పేర్కొంది. ఆధార్ కార్డు, వివాహ ధ్రువీకరణకు రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్, పెండ్లి ఫొటోలు తప్పని సరి చేసింది. అయితే చదుకున్న వారికి విద్యార్హత సర్టిఫికెట్ సరిపోతుండగా, నిరక్షరాస్యులకు దంత వైద్యులు నిర్ధారించాల్సి ఉంది. దంత వైద్యులు.... దరఖాస్తుదారులు, వారి కుటుంబ సభ్యుల జ్ఞాన దంతాలను పరీక్షించి, వాటి ఆధారంగా మేజర్, మైనర్‌గా వయసును నిర్ధారిస్తారు. అయితే ప్రభుత్వ వైద్యాశాలలో దంత వైద్యులు సర్టిఫికెట్లు ఇవ్వకపోవటంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి.



చేయితడిపి.. తొందరగా..

రైస్‌కార్డు దరఖాస్తు ఉచితమని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, కొందరు సచివాలయాల సి బ్బంది మాత్రం కార్డుకు. రూ. 300 నుంచి రూ.500 డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. డబ్బు ఇవ్వకపోతే ఇప్పుడు కాదు మళ్లీరావాలని పదేపదే దరఖాస్తుదారులను తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. వివాహ, వయసు ధ్రువీకరణ పత్రాలు పొందటం ఒక సమస్య అయితే సచివాయాల సిబ్బంది డబ్బు డిమాండ్‌తో ప్రజలు విసిగి వేసారి పోతున్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్, వివాహ సర్టిఫికెట్ నిబంధన తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా బయోమెట్రిక్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

షింగింగ్ స్టార్స్ అవార్డుకు చుండి స్కూలు విద్యార్థుల ఎంపిక

వలేటివారిపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న షింగింగ్ స్టార్స్ అవార్డుకు మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో చదివిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బోడా నవ్యశ్రీ 592, ప్రగడ రాజేష్ 591, మీసాల మనోజ్ఞ 591, వీరమోసు జయసంహిత 591, చెరువుపల్లి హంతివకసాయికోటి 591 మార్కులు సాధించారని తెలిపారు. వీళ్లందరూ మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు.

మెప్మా పీడీగా లీలారాణి బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (హరనాధపురం) మే 19 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా లీలారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. లీలారాణి రాజంపేటలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పనిచేస్తూ ఇక్కడకి వచ్చారు. లీలారాణి గతంలో గూడూరు తహసీల్దారుగా పనిచేశారు. జిల్లాలో మెప్మా పీడీగా పనిచేస్తున్న రాధమ్మ చిత్తూరు జిల్లా మెప్మా పీడీగా నియమితులయ్యారు. సోమవారం రాధమ్మ నుంచి లీలారాణి బాధ్యతలు స్వీకరించారు.

అర్జీలకు పరిష్కారం చూపండి

● అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

● పీజీఆర్ఎస్‌కు 385 వినతులు

నెల్లూరు (హరనాథపురం) మే 19 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యలకు కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు 385 అర్జీలను అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూకు 170, మున్సిపల్ శాఖకు 30, సర్వేకు 32, పంచా యతీరాజ్ శాఖకు 23, పోలీసు శాఖకు 49, సివిల్ సప్లయిస్‌కు 17 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జేసీ కే.కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

● అభిప్రాయ సేకరణ తప్పనిసరి

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రజల నుంచి అభిప్రాయాలను తప్పనిసరిగా సేకరించాలని కలక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో పీజీఆర్ఎస్ అర్జీలు, ఉపాధిహామీ, హౌసింగ్ తదితర అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల అభిప్రాయాలు తెలుసుకుని రిపోర్టు అందించాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని పేర్కొన్నారు. ప్రతివారం కనీసం 70 శాతం తగ్గకుండా పనులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసిందని, దశలవారీగా నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజనను ఏర్పాటు చేసుకోవడంతో కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆధార్‌కార్డులు లేని ఎస్టీలకు త్వరగా కార్డులు ఇప్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

ఫిర్యాదులను విచారించి న్యాయం చేస్తాం

నెల్లూరు(క్రైం), మే 19 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ జీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన వేదిక కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 97 మంది తమ ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదుల వివరాలు...

● సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనలు నమ్మి సైదాపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ ట్రైండ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. ఆ యాప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ప్లాట్ల వ్యాపారం చేద్దామని నమ్మించి రూ.6,27,900 నగదును తనఖాతాలో వేయించుకొని ప్లాట్ల పత్రాలు అడగ్గా మోసం చేశాడని ఫిర్యాదు చేసింది. విచారించి న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.

● నగరంలోని బాలాజీనగర్‌కి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో రుణం కోసం ప్రయత్నిస్తుండగా హైదరాబాద్‌కు చెందిన పోలా కుమార్, చల్లా చంద్రమోహన్ పరిచయమయ్యారు. హాంకాంగ్‌లో ట్రేడింగ్ కంపెనీ వ్యాపారం ఉందని, రూ.కోటి పెట్టుబడి పెడితే 500 మిలియన్ డాలర్లు వస్తాయని నమ్మించారు. వారి మాటలు నమ్మి నగదు పెట్టుబడిగా పెట్టగా, తిరిగి డబ్బులు ఇవ్వకుండా, అడిగితే రౌడీలతో బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని వారు కోరారు.

● బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన కొల్లూరు సన్నీ బుచ్చికి చెందిన ఓ మహిళను ప్రేమిస్తున్నాని, పెళ్లిచేసుకుంటానని నమ్మించి, తన కోర్కె తీర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమని కోరితే ముఖం చాటేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.


ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

● బాపట్లకి చెందిన మహేష్ కోవూరుకి చెందిన వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.13 లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా నగదు ఇవ్వాలని కోరితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని కోరాడు.

● సౌత్‌మోపూరుకు చెందిన కృష్ణారెడ్డి నకిలీ కన్సల్టెన్సీ పెట్టి వేదాయపాలెంకి చెందిన ఓ యువకుడు, అతడి స్నేహితుడు వద్ద రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, న్యాయం చేయాలని కోరారు.

● ఉలవపాడుకి చెందిన తన కుమారుడు రమీజు 2024లో మృతిచెందాడని, అది ప్రమాదం కేసుగా నమోదు చేశారని, తనకు కుమారుడి స్నేహితులపై అనుమానం ఉందని, లోతుగా దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు మండలంలో అర్హులైన మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అప్పాజీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శీలు అర్హులన్నారు. 21 నుంచి 55 ఏళ్లలోపు వయసు కలిగిన వారు తగిన ధ్రువపత్రాలతో ఈనెల 25వ తేదీలోపు ఓబీఎంఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9018
వెండి కిలో ధర	రూ. 98,100
వెండి ఒక గ్రాము	రూ. 101.10

పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

షేక్ నాగూర్‌వలి, డిప్యూటీ ఎంపీడీవో



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 19 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చి ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో షేక్ నాగూర్‌వలి తెలిపారు.

? పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గ్రామాల్లో మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ప్రతినిత్యం తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం.

? హరిత రాయబారుల వేతన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు.

! వేతన బకాయిలు ఉన్న మాట వాస్తవమే. గతంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెల్లింపులు జరిగే సమయంలో పంచాయతీని బట్టి సుమారు 15నెలల వరకు వేతనాలను చెల్లించాల్సి ఉంది. త్వరలో చెల్లింపులకు చర్యలు చేపడతాం.

? చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తారా.

! మండలంలో 23 కేంద్రాలకు గాను ప్రస్తుతం 7 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన వాటిని 15వ ఆర్థిక సంఘం నిధులతో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

? మూలకు చేరిన వాహనాల పరిస్థితి ఏంటి.

! పలు పంచాయతీల్లో చెత్త సేకరణకు కేటాయించిన బ్యాటరీ వాహనాలు, రిక్షాలు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వినియోగంలోకి తీసుకురావడంతో పాటు అవసరమైతే నూతనంగా కొనుగోలు చేయడం జరుగుతుంది.

న్యూస్ బాక్స్

రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట సోమవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జీ.చెరువుపల్లి పంచాయతీ సంజీవరాజుపల్లి గ్రామానికి చెందిన ఓంకారం వెంకటసుబ్బయ్య కర్నూల్‌లోని పుల్లాయరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన అడుసుమల్లి చంద్రుష గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులోని మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతోంది. ఈనేపథ్యంలో వారిద్దరు ఫ్రెండ్స్ యాప్ ద్వారా పరిచయమై ప్రేమించుకున్నారు. పెద్దలు పెళ్లికి అంగీకరించకపోవడంతో ఈనెల 16న చంద్రుషను తీసుకొని వెంకటసుబ్బయ్య బెంగళూరు వెళ్లాడు. అక్కడి నుంచి సోమవారం దుత్తలూరు మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయానికి చేరుకుని వివాహం చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలంటూ ఉదయగిరి పోలీసులను ఆశ్రయించారు. కాగా, ఈనెల 16న తమ కుమార్తె కనిపించడంలేదని తల్లిదండ్రులు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

రేపు మండల సమావేశం

అనంతసాగరం, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 21వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రయ్య తెలిపారు. ప్రభుత్వ పథకాలు, సమస్యలపై చర్చ జరుగుతుందని, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

సూచిక బోర్డు లేక వాహనదారుల అవస్థలు



సూచిక బోర్డు లేని సన్నవారిపల్లి వద్ద ఉన్న జంక్షన్

మర్రిపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారుల కూడలిలో సూచిక బోర్డులు లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని సన్నవారిపల్లి వద్ద ఉన్న మూడురోడ్ల జంక్షన్‌లో సూచికబోర్డు లేనందున మర్రిపాడు నుంచి ఏపిలగుంట మీదుగా ఉదయగిరికి, ఖాదర్‌పూరు మీదుగా చిన్నమాచునూరు వెళ్లే వాహనదారులు ఎటు వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం : ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో మండల టీడీపీ కన్వీనర్ గొంగటి రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన ఉదయగిరి నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉగ్రవాదులు, పాకిస్తాన్ దాడుల్లో వీరమరణం పొందిన ప్రజలు, జవాన్లకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అన్నివర్గాలకు సమానంగా సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరిగేలా పలు తీర్మానాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కాపాడేందుకు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం దివంగత నందమూరి తారకరామారావు టీడీపీని స్థాపించారన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పాలన సాగుతోందన్నారు. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. కోటి సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీయేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. 143 పంచాయతీల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అలాగే ఉదయగిరి దుర్గం, నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ, ఘటికసిద్ధేశ్వరాలయాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్ది పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు వికాస్‌హరికృష్ణ, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, సీనియర్ నాయకుడు కాకర్ల వెంకట్, రాష్ట్ర నాయకులు బొల్లినేని వెంకటరామారావు మన్నేటి వెంకటరెడ్డి, రియాజ్, మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, రాఘవేంద్ర, ఎనిమిది మండలాల టీడీపీ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

పట్టణంలోని ఎస్వీ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన మినీ మహానాడులో వైసీపీ నుంచి పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జమ్మలపాలెం సర్పంచ్ శ్రీవేణి, వింజమూరు సర్పంచ్ నల్లగొండ సృజన, మండల వైస్ ప్రెసిడెంట్ ఆనంగి రమణయ్య, ఉదయగిరి పట్టణానికి చెందిన గాజుల నిజాముద్దీన్, సీతారామపురం మండలం నుంచి 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాకర్ల పార్టీ కండువా వేసి స్వాగతం పలికారు.

పుచ్చలపల్లి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి : సీపీఎం



ఆత్మకూరు : పుచ్చలపల్లికి నివాళులు అర్పిస్తున్న రైతు సంఘం నాయకులు



ఏఎస్ పేట: మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేసి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నేతలు

ఆత్మకూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్, ఏ శ్రీనివాసులరెడ్డి తదితరులు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారక భవన్‌లో సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, అభిమానులు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం, సీఐటీయు, రైతు సంఘం నేతలు మాట్లాడుతూ పుచ్చలపల్లి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు కె డేవిడ్‌రాజు, ఆత్మకూరు నాగయ్య, నాగేంద్ర, సీఐటీయు నాయకులు జి శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య, గుల్జార్‌బేగం, యస్దానీ, ప్రజానాట్యమండలి కళాకారులు గద్దర్‌బాబు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎలక్ట్రిసిటీ యూనియన్, సీఐటీయు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

● అనంతసాగరం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానికులకు అరటిపండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అన్వర్‌బాష, సుబ్బారాయుడు, వేము పెంచలయ్య, గాడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో వర్ధంతి సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య, వైద్యం, గూడు, నీడ కోసం పోరాటం చేసిన వ్యక్తి సుందరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఫరుద్దీన్‌బాషా, రమణయ్య, వెంకటేశ్వర్లు, నాయబ్, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : పుచ్చలపల్లి ఆశయాలను సాధిస్తాం అని సిపిఎం మండల కార్యదర్శి మొగల్ నిస్సార్ అహ్మద్ తెలిపారు. సోమవారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంట లక్ష్మిపతి, దిలియాజ్, అస్లాం, సిఐటియు నాయకులు గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఏఎంసీ చైర్మన్‌గా జనార్దన్



ఆరికట్ల జనార్దన్‌నాయుడును అభినందిస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్‌తోపాటు డైరెక్టర్ల నియామకానికి పచ్చజెండా ఊపింది. దీంతో మూడేళ్ల తరువాత ఆత్మకూరు మార్కెట్ కమిటీ పాలకవర్గం కొలువుదీరనుంది. ఏఎంసీ చైర్మన్ పదవి మర్రిపాడు మండలం టీడీపీ కన్వీనర్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడును వరించింది. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీంతో ఆరికట్ల జనార్ధన్‌నాయుడును పలువురు టీడీపీ నేతలు అభినందించారు. కాగా, మార్కెట్ కమిటీ పాలక వర్గంలో 20 మంది సభ్యులుంటారు. వారిలో 12 మంది రైతులు, ముగ్గురు వ్యాపార, వాణిజ్య రంగంలో వారు, నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు(అధికారులు)తో పాటు ఎమ్మెల్యే కూడా సభ్యుడిగా ఉంటారు.

వీధి కుక్కల స్వైర విహారం



గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఉదయగిరి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బస్టాండ్ సెంటర్లు, ప్రధాన వీధులు, మాంసాహార దుకాణాలు, హోటళ్ల సమీపంలో గుంపులు, గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలతో పాటు వాహనదారులు సైతం వాటి నుంచి తప్పించుకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వాహనదారులను వెంబడిస్తుండడంతో తప్పించుకొనే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో చేతిలో కర్రలు పట్టుకొని వీధుల్లో సంచరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కుక్కల దాడిలో చిన్నారులతో సహా మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎటువైపు చూసినా శునకాలు స్వైర విహారం చేస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా తీసుకొచ్చి వదిలేశారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు మనకెందుకులే అంటూ మౌనం వహిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ప్రస్తుతం వేసవి దృష్ట్యా కడుపు నింపుకునేందుకు గ్రామాల్లోకి వచ్చిన మూగజీవాలు సైతం కుక్కల దాడిలో మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల ఉదయగిరి మండలం మాసాయిపేట గ్రామంలో సంచరిస్తున్న చుక్కల దుప్పిపై వీధి కుక్కలు దాడి చేయడంతో మృత్యువాత పడింది. దీంతో ఒక వైపు ప్రజలు తమను తాము కాపాడుకుంటూ మరోవైపు తమ మూగజీవాలకు సైతం ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా చూసుకోవడం సవాల్‌గా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించాలి



మహిళలకు సూచనలిస్తున్న కోఆర్డినేటర్లు

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించి ఆర్థిక పరిపుష్టి సాధించాలని బీసీ కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్లు సుమతి, పద్మా సూచించారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని శిక్షణ కేంద్రాల కంటే ఉదయగిరి కేంద్రంలో అధికమంది మహిళలు శిక్షణ పొందుతున్నారన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు షేక్ నాజియాతాజున్, శిక్షకురాలు పద్మ, మహిళలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసులు

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఆర్ఎంటీలు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సీఆర్ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పాఠశాలల ఆవాస ప్రాంతాల పరిధిలోని బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం, విద్యార్థుల నమోదు కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల సహకారం, విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ తదితర అంశాలపై చర్చించారు.

విద్యార్థి మిత్ర కిట్స్ పరిశీలన

స్థానిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థి మిత్ర కిట్స్ స్టాక్ పాయింట్‌ను సోమవారం సర్వశిక్షా అభియాన్ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి పెంచలయ్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల బెల్టులను పరిశీలించారు. విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు పంపిణీ చేసే వస్తువులన్నింటినీ సిద్ధంగా ఉంచుకొని పాఠశాలల పునఃప్రారంభంనాటికి ప్రతి విద్యార్థికి కిట్ అందజేయాలన్నారు. తొలుత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్ఐలు, సిబ్బంది

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ నెల్లూరు 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన పామూరు సుబ్బయ్యను సోమవారం ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీనివాసులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుదాఘాతానికి యువకుడి దుర్మరణం



చిన్న ఓబుల్‌రెడ్డి మృతదేహం

వింజమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం జరుగుతున్న మినీ మహానాడుకు వచ్చి బస్టాండు సెంటర్‌లోని చిల్లర దుకాణం వద్ద విద్యుదాఘాతానికి గురై దుత్తలూరు మండలం బైరవరం గ్రామానికి చెందిన బోగిరెడ్డి చిన్నఓబుల్ రెడ్డి (29) మృతి చెందారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి దుకాణం పైకప్పులకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ విషయం తెలియక చిన్నఓబుల్ రెడ్డి పైపును తాకగానే విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మహానాడు అనంతరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరామర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ పరంగా ఆదుకుంటామని తెలిపారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

సంగం, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరపనాయుడు కండ్రికలోని ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటున్న ఓ వృద్ధుడు సోమవారం కాలువ నీటిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... నెల్లూరుకు చెందిన కిలారి రామానాయుడు (80) గత కొన్ని నెలల నుంచి ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. వృద్ధాశ్రమంలోని వృద్ధులు అప్పుడప్పుడు బయటకు వెళ్లి తిరిగి వస్తుంటారు. ఈక్రమంలోనే కిలారి రామానాయుడు ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం అయినా రాకపోవడంతో నిర్వాహకులకు అనుమానం వచ్చి ఆశ్రమం పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. సమీపంలోని కనిగిరి ప్రధాన కాలువ గట్టు వద్ద వృద్ధుడు వాడే కర్ర ఉండడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఇరిగేషన్ అధికారులతో కాలువ గేట్లు మూసేసి నీటి విడుదలను తగ్గించారు. సాయంత్రం వృద్ధుడి మృతదేహం కాలువలో తేలడంతో గట్టుకు చేర్చారు. అనంతరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆత్మకూరు వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి...



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొదలకూరు రోడ్డులో గల ఎస్సీ బంగ్లా ప్రహరీగోడ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 94407 00018, 94403 33191 నెంబర్లకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ మౌలాలి

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ శివారులోని గండిపాళెం మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన బొమ్ము మౌలాలీ బైక్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా జాతీయ రహదారి సర్కిల్ ప్రాంతానికి రాగానే కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన మౌలాలీని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల స్వాధీనం



పట్టుకున్న వాహనంతో పోలీసులు

సంగం, మే 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న నాలుగు వాహనాలను మండలంలోని దువ్వూరు వద్ద ఆదివారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. దువ్వూరు సమీపంలో అరవపాళెం, అన్నారెడ్డిపాళెం, మక్తాపురంలోని చేపల చెరువులకు మేతగా తరలిస్తుండగా పోలీసులుదాడిచేసి పట్టుకునారు. ఈ వాహనాల్లో సుమారు 45 డమ్ములు ఉన్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి చికెన్ వ్యర్థాలను సంగం కొండ ప్రాంతంలో గుంతలు తీసి పూడ్చివేశారు. వాహనదారులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుప్తనిధుల ముఠా సభ్యుడి పట్టివేత

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాల ముఠా సభ్యుడిని అటవీ శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా తెలిపిన వివరాల మేరకు.. గత కొన్ని రోజులుగా ఉదయగిరి దుర్గంపై గుప్తనిధుల తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ క్రమంలో సోమవారం వరికుంటపాడు మండలం తూర్పుబోయమడగల ఎస్టీ కాలనీకి చెందిన నల్లు అశోక్, మర్రిపాడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రమేష్, గోపిలు దుర్గం కొండపై గుప్తనిధుల తవ్వకాల కోసం వెళుతున్నారన్నారు. వారు మండలంలోని బండగానిపల్లి అటవీ ప్రాంతం నుంచి రాణిబావి వెయ్యి మెట్ల మార్గం గుండా భోజన సామాగ్రితో దుర్గంపైకి వెళుతుండగా తమ సిబ్బంది పట్టుకునే ప్రయత్నం చేయగా రమేష్, గోపిలు పరార్ కాగా, నల్లు అశోక్ సిబ్బందికి చిక్కాడన్నారు. అతడిని రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. మంగళవారం పూర్తిస్థాయిలో విచారించి కోర్టులో హాజరుపర్చడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య, ఎఫ్‌బీవోలు లక్ష్మీప్రసన్న, భానుతేజ, వెంకటేశ్వర్లు, బేస్‌క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అదుపులోకి తీసుకున్న వ్యక్తితో అటవీ అధికారులు

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే దగుమాటి

బిట్రగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచెట్లపాలెం, పాతపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టు వద్ద ఏర్పడిన పెద్ద గోతుల వలన ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఆయన బోగోలు మండలం తూర్పు తీర ప్రాంత టీడీపీ మత్స్యకార నేత ఇంట వివాహ కార్యక్రమానికి ఆ మార్గంలో వెళ్లి ఆ గోతిని గమనించారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ఇలాంటి గుంతల వలన ప్రమాదాలు జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతారని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సూచించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, ఆదిశేషయ్య, మత్స్యకార నేతలు పార్థన్, గోవిందు, కొండయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

బలహీనవర్గాల అభివృద్ధే టీడీపీ అజెండా

● కావలి మినీ మహానాడులో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ● మాజీ సీఎం ఎన్టీ రామారావుకు ఘన నివాళి





కావలి మినీ మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, సమావేశానికి హాజరైన టీడీపీ నేతలు, కార్యకర్తలు

కావలి, మే 19(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభివృద్ధే అజెండాగా సంక్షేమ పథకాలను టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని కావలి ఎమ్మెల్యే దగమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని మనోహర్‌రెడ్డి, నారాయణల కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం కావలి నియోజకవర్గ మినీ మహానాడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఇటీవల కాలంలో మృతి చెందిన టీడీపీ కుటుంబ సభ్యులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలలకే అప్పటి కాంగ్రెస్ దర్మార్గపాలనను అంతం చేస్తూ టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఈ సభలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, బీద గిరిదర్, జ్యోతి బాబూరావు, పోతుగంటి అలేఖ్య, డాక్టర్ ప్రభాకర్ నాయుడు, మొగిలి కల్లయ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఆవుల రామకృష్ణ, పోట్లూరు శ్రీనివాసులు, వడ్డే శ్రీకాంత్ నాయడు, మాలేపాటి నాగేశ్వరరావు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, బొట్లగుంట శ్రీహరినాయుడు, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఇవి తీర్మానాలు

అనంతరం టీడీపీ మండల అధ్యక్షులు, నేతలతో కలిసి కావలి నియోజకవర్గంకు సంబంధించిన పలు తీర్మానాలకు మినీ మహానాడులో ఆమోదించారు. దగదర్తిలో విమానశ్రయం, రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్ కంపెనీ నిర్మింపచేస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపుతూ తీర్మానించారు. బిట్రగుంటలో వందేభారత్ సర్వీస్ సెంటర్, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కావలి రూరల్ మండలం, అల్లూరుకు సంబంధించి రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టు వరకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మీదుగా 4 లైన్ల జాతీయ రహదారి నిర్మించాలని తీర్మానించారు. కావలి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఉదయగిరి రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకు పడమర వైపున బైపాస్ నిర్మాణం, కావలి పట్టణ తూర్పు, పడమరలను అనుసంధానం చేస్తూ రేల్వే అండర్‌పాస్‌లను నిర్మించాలని, కావలి పట్టణంలో అడిషనల్ జిల్లా జడ్జి కోర్టు, మినీ స్టేడియం నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాల కావాలని తీర్మానం చేశారు.

సంక్షేమ పథకాల ఆద్యుడు ఎన్టీఆర్

● అభివృద్ధికి ఐకాన్ చంద్రబాబు ● కందుకూరు మినీ మహానాడులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసి సంక్షేమ పథకాల ఆద్యుడుగా టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అయితే.. అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కించటం ద్వారా చంద్రబాబునాయుడు అభివృద్ధికి ఐకాన్‌గా నిలిచారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని తిరుమల కళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం కందుకూరు నియోజకవర్గ స్థాయిలో టీడీపీ మినీ మహానాడు కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇటీవలి కాలంలో మృతి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు, పెహల్గాం ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి, పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మృతి చెందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలనుద్ధేశించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 43 ఏళ్లు పూర్తికాగా అందులో 23 సంవత్సరాలు అధికారంలో ఉన్నామంటే మన నాయకులు అందించిన సుపరిపాలనతో పాటు దానివెనుక కార్యకర్తల కృషి మరువలేనిదని పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని వారికి అండగా ఉండటం ద్వారా పార్టీ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో ఎంతోకాలంగా పురోగతిలేని ఏడు ప్రధాన సమస్యలను ఈనెల 27,28,29 తేదీలలో కడపలో జరగనున్న మహానాడులో ప్రవేశపెట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, రాచగర్ల సుబ్బారావు, కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, ఎస్వీ రమణయ్య, గొట్టిపాటి హరికృష్ణ, కల్లూరి శైలజ, మన్నం శైలజ, అల్లం సుమతి తదితరులు పాల్గొన్నారు.





కందుకూరు మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మినీ మహానాడుకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

న్యూస్ బాక్స్

కందుకూరు నుంచి శ్రీశైలానికి ఆర్టీసీ బస్సు

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు నుంచి పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ సర్వీస్‌ను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా బసు నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన సర్వీస్‌లను ప్రారంభించటం జరుగుతోందని, శ్రీశైలంకు నడుపుతున్న ఆర్టీసీ సర్వీస్‌ను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ నూతన సర్వీస్ ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆర్టీసీ అధికారులు, తెలుగునాడు ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఇంచార్జి మేనేజరు రాపూరి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నార్నె రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

86 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 400 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 314 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-65, ఆర్ఆర్-6, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 86 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.248.64గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కలిగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): కలిగిరి, కొండాపురం మండలాల పరిధిలోని తూర్పు దూబగుంట-కొమ్మి అటవీప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,180 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఉమాశంకర్ సోమవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● కొండాపురం : మండలంలోని ఆదిమూర్తిపురంలో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పాఠశాల వెనుకవైపున పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఇన్‌చార్జి ఎస్‌ఐ ఉమాశంకర్, పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

కొండయ్య మృతికి సంతాపం

బిట్రగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత గద్దె కొండయ్య(65) మృతికి టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. బోగోలు మండలం ఏబీకండ్రి పంచాయతీకి చెందిన టీడీపీ నేత, మాజీ జేపీగూడూరు నీటి సంఘం అధ్యక్షుడు కొండయ్య ఆదివారం మృతి చెందగా సోమవారం ఆయన స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో టీడీపీ నేతలు పాల్గొన్ని పూలమాలు వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో కే.వెంకటేశ్వర రెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, వై.వెంకటేశ్వర్లురెడ్డి, పీ.సుబ్బారావు, ఏ.ఆదిశేషయ్య, బీ.మాధవ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చినుకు రాలితే రోడ్లు జలమయం



కావలిరూరల్ : సినిమాహాల్ రోడ్డులో నిల్వ చేరిన వర్షపు నీరు



కావలిరూరల్ : తీగల సపోర్టుతో వేలాడుతున్న రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం



లింగసముద్రం : ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కావలి రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): చినుకు రాలితే కావలి పట్టణంలోని రోడ్లన్నీ వర్షపు నీటి నిల్వలతో జలమయమవుతోన్నాయి. సోమవారం కురిసిన చిన్నపాటి వర్షానికి పట్టణంలోని లత థియేటర్, వెంకటేశ్వర థియేటర్, బ్రిడ్జి సెంటర్, ముసునూరు ఆంజనేయస్వామి ఆలయం, వెంగళరావునగర్ బోర్డు తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై రోడ్లపై ప్రవహించింది. దీంతో పట్టణ ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

విరిగిన విద్యుత్ స్తంభం

కావలి పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ స్తంభం విరిగిపడింది. రాత్రి సమయం కావడం, ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. నేలకొరిగిన విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న నివాసాలపై పడకుండా తీగల మోపున వేలాడడం చూసి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని స్థానికులు అనేక దఫాలు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 30 నుంచి 40 ఏళ్ల క్రితం నాటి స్తంభాలు కావడంతో అవి ప్రమాదపుటంచున ఉన్నాయి. తెల్లవారు జామున వీచిన గాలులు, చిన్నపాటి వర్షానికే స్తంభం విరిగి పడడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చెయ్యాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

40.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు

కొండాపురం : మండల పరిధిలో సోమవారం 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో మండల ప్రజలు ముఖ్యంగా చిన్నారులు, పెద్దలు అల్లాడిపోయారు. ప్రస్తుతం రోజంతా చిరుజల్లులు కురుస్తూ వాతావరణం చలబడడంతో ప్రజలు కాస్త ఉపశమనం చెందారు. అలాగే పొలాల దుక్కులకు రైతులు సిద్ధమయ్యారు.



జలదంకి : భారీవర్షంతో జమ్మలపాలెం చెరువులోకి చేరిన వర్షపునీరు

జలదంకిలో భారీ వర్షం

జలదంకి : మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. సాగులో ఉన్న పలు రకాల పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయాన్నే రైతులు పొలాల్లోకి వెళ్లి ఆరుతడి, మెట్టపంటల్లో నిలిచిన వర్షపునీటిని బయటకు పంపించారు. పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు మాత్రం ఈ వర్షం వల్ల కొంత మేర నష్టం ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ ఏడాది రెండో పంటకు కావలి కాలువకు సాగునీరు ఇవ్వడంతో రైతులు పోసిన వరినారుమళ్లకు ఇబ్బంది లేకుండా అరకొరగా ఉన్న సాగునీటి చెరువులు, వాగులు, వంకల్లో జలకళ సంతరించుకుంది.

ఓ మోస్తరు వర్షం

లింగసముద్రం : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో మండలంలోని పలు గ్రామాలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలో 16.2 మి.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఈ వర్షానికి మొగిలిచెర్ల, పెదపవని, వీఆర్ కోట, లింగసముద్రంతో పాటు పలు గ్రామాలలోని వీధులు జలమయమయ్యాయి. ముఖ్యంగా లింగసముద్రంలోని మీసేవా కేంద్రం పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై వర్షపు నీరు రోడ్డుపై నిలవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం పత్తి పైరుకు, జొన్నమేతకు మేలు చేకూర్చిందని రైతులు తెలిపారు.

మున్సిపాలిటీ స్థలానికి దేవదాయ శాఖ లీజు వేలం తగదు

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంకమ్మ దేవాలయానికి వెనుక ఉన్న మున్సిపాలిటీ స్థలంలో గదులు నిర్మించుకుని అద్దెలకు ఇచ్చేలా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24న బహిరంగ వేలం నిర్వహిచనుండడం శోచనీయమని, తక్షణం ఆ వేలంను నిలిపివేయాలని న్యాయవాది పెట్లూరి మురళి, పలువురు ఆలయ ఆచారస్తులు సోమవారం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు, మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అంకమ్మ దేవాలయం వద్ద ఆలయానికి ఉన్నది 1.52 ఎకరాల స్థలం కాగా మిగిలినది మున్సిపాలిటీ స్థలమని, ఆలయం పోను మిగిలిన ఖాళీస్థలంలో వాణిజ్య సముదాయాలు నిర్మిస్తే ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగుతుందని తక్షణం ఆ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఆలయ తిరుణాళ్ల, వివిధ పర్వదినాల సమయంలో జరిగే పార్వేట మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివస్తారని, ఈ సితిలో భక్తుల సౌకర్యార్థం ఖాళీ స్థలాన్ని అలాగే వదిలేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గతంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం కూడా చేసి ఉన్నారని తెలిపారు.

కావలిలో తిరంగా ర్యాలీ



కూటమి నేతలు, అధికారులు నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

కావలి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సోమవారం రాత్రి కావలి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గుర్రం పెట్రోల్ బంకు నుంచి ఐకాన్‌సెంటర్ వరకు వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలతో కలిసి ఈ ర్యాలీ కొనసాగించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతోపాటు ఆర్డీవో ఎం. వన్నీవంశీ కృష్ణ, డీఎస్పీ పీ.శ్రీధర్, మున్సిపల్ కమిషపనర్ జీ. శ్రావణికుమార్, తహసీల్దార్ పీ. శ్రావణ్ కుమార్, ఎమ్పీడీవో సీహెచ్. శ్రీదేవితోపాటు వివిధశాఖల అధికారులు, మాజీ సైనికులు, ప్రజలు జాతీయ జెండాల తో జయహో భారత మాత అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే మా ట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రమూకలను సమర్థవంతంగా ఎదర్కొన్న ప్రధాన మంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన భారతీయులకు ప్రగాఢ సానుభూతిని తెలపుతూ భారతీయుల యువత దేశరక్షణకు ముందుండాలన్నారు.

ఎట్టకేలకు వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం

దగదర్తి(బిట్రగుంట), మే 19(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక ఎట్టకేలకు ఏకగ్రీవం అయింది. వైస్ ఎంపీపీ పీతల కామేశ్వరికి ఉద్యోగం రావడంతో పదవికి రాజీనామ చేశారు. దీంతో నిర్వహించిన ఉప ఎన్నిక రెండు సార్లు వాయిదా పడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన ఉప ఎన్నికకు 11 మందికి 8 మంది సభ్యులు హాజరు కావడంతో ఎన్నిక నిర్వహించినట్లు రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు తెలిపారు. వైస్ ఎంపీపీగా కుడుముల చిన్నమ్మను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ తదితరులు ఉన్నారు.

రూ.2.24 కోట్లతో కేజీబీవీ అభివృద్ధి

లింగసముద్రం, మే 19(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సుమారు రూ.2.24 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. మూడేళ్ల క్రితం ఈ విద్యాలయంలో ఇంటర్మీడియట్‌ను ప్రారంభించారు. దీంతో తరగతుల నిర్వహణ, వసతికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఇంటర్ విద్యార్థినుల కోసం డార్మెట్రీ, తరగతి గదుల నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం రూ.1,27,28,830 మంజూరు చేసింది. అలాగే నాడు-నేడు రెండవ విడత ఈ ప్రాంగణంలో చేపట్టి అసంపూర్తిగా నిర్మించిన 8 అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు మరో రూ.96 లక్షలు మంజూరు చేసింది. దీంతో మొత్తం రూ.2,23,82,830లతో చేపట్టనున్న పనుల కోసం టెండర్లు పూర్తికావడంతో కాంట్రాక్టరు అగ్రిమెంటు కూడా చేసుకున్నట్లు తెలిసింది. రూ.1,27,82,830లతో గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 తరగతి గదులు, మొదటి అంతస్తులో డార్మెట్రీ కోసం 3 గదులు న్మిర్మిస్తామని సమగ్ర శిక్ష అభియాన్ ఏఈ ఎన్ మస్తానయ్య తెలిపారు. అలాగే రూ.96 లక్షలతో అసంపూర్తిగా ఉన్న 8 అదనపు తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఇంకా అవకాశం ఉంటే కేజీబీవీ విద్యాలయం పైన 10 ఏళ్ల క్రితం అసంపూర్తిగా నిలిచిన గదుల నిర్మాణాలను కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ పనులను 9 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

మరమ్మతులకు నోచని చేతి పంపులు!

● ప్రజలకు తప్పని అవస్థ

● శ్మశాన వాటికల్లోనూ మంచినీటికి ఇక్కట్లు



ఇబ్రహీంపేట శ్మశాన వాటికలో శిథిలావస్థలో చేతిపంపు

బిట్రగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు ప్రాంతాల్లో చేతి పంపులు మరమ్మతులకు గురవడంతో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శ్మశాన వాటికల్లో ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుని ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఉప్పు, జవ్వనీటి కారణంగా బోరు, లోపల పైపులు దెబ్బతిన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని శ్మశానవాటికలో చేతిపంపు మరమ్మతులకు గురై ఏడాది కాలం గడుస్తున్నా పట్టించుకున్నే నాథుడు లేడు. గ్రామస్థులు కర్మక్రతువులు చేసుకోవాలంటే నీరు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. రామస్వామిపాలెంలోని దళిత, గిరిజన కాలనీ వాసులే కాకుండా విశ్వనాథరావుపేటలోని కొన్ని కుటుంబాలకు సంబంధించిన శ్మశాన వాటికలో చేతి పంపే ఆధారం. అది మరమ్మతులకు గురై ఆరు నెలలు కావస్తున్నా అధికారులు పంటించుకోలేదు. ఓ పక్క మండుతున్న ఎండలు, మరో పక్క పనిచేయని చేతిపంపులతో ప్రజలు తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి నెలకొంది. బోగోలు పాతహరిజనవాడలో బోరు మరమ్మతులకు గురవడంతో స్థానికులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదు. దీంతో ఆ చేతిపంపు శిథిలావస్థకు చేరింది. అదే విధంగా విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామ శ్మశాన వాటికలో చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో కర్మక్రతువులు చేసుకునేందు వచ్చిన వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజల పట్ల కొందరు మండల అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని స్థానికులు తెలిపారు. శ్మశాన వాటికల్లో చెడిపోయిన చేతిపంపులకు మరమ్మతులు చేయించాలన్న ఆలోచన లేకపోవడం బాధాకరమని జైభీం అంబేద్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర అన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



కావలి : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కావలి, మే 19(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ పుచ్చలపల్ల సుందరయ్య 40 వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం కావలి సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఎం నేత పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ సుందరయ్యలేని లోటు వామపక్ష ఉద్యమాలలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దక్షిణభారత మార్కిస్ట్ పార్టీ నిర్మాత, బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన సుందరయ్య ప్రజల, కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు అలుపెరగని పోరాటాలు నడిపారన్నారు. పార్లమెంట్‌లో ప్రజా ఉద్యమాలపై గళమెత్తారన్నారు. ఆయన ఇచ్చిన మార్కిస్ట్ పార్టీ జెండాను పట్టుకుని ఆయన ఆశయాలను సాధించేందుకు కార్యకర్తలు పోరాటాలు కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు టీ సుబ్బరాయశర్మ, ఎస్.వెంకయ్య, పీ.తిరిపాలు, జేవీవీ నాయకులు ఆకుల రమణయ్య, హరినారపరెడ్డి, యూటీఎఫ్ నాయకులు బీ.శ్రీదేవి, కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


గుడ్లూరు : ప్రజానాయకుడు, దక్షిణ భారతదేశ కమ్యునిస్టు ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని గుడ్లూరు శివాలయం వీధిలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, గంటెనపల్లి వెంకటేశ్లర్లు, మద్దిశెట్టి జాలయ్య, దామా కృష్ణయ్య, మెగిలిశెట్టి వెంకటేశ్వర్లు, సిద్దయ్య, కొప్పోలు నారాయణ, కొమరగిరి అంజయ్య, సుంకరి విజయలక్ష్మి, నేలటూరి తిరుపాలు, పరుసు నాగరాజు, వల్లెపు విజయ, కోటమ్మ పాల్గొన్నారు.

బిట్రగుంట : నేటితరం పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, సీఐటీయు మండల కార్యదర్శి చల్లానరహరి అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్‌లు ఎస్‌కే.అన్వర్ భాషా, కార్మికసంఘ నేత బాదుల్లా, రామయ్య, వెంకటేశ్వర్లు, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్, వినయ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి జమ్మలపాలెం సర్పంచు

జలదంకి మే 19(ఆంధ్రజ్యోతి): వింజమూరులో సోమవారం జరిగిన మినీ మహానాడులో వైసీపీకి చెందిన జమ్మలపాలెం సర్పంచు బుర్రి శ్రీవేణి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఆమెకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా మండలంలోని 17 పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా మినీ మహానాడుకు తరలివెళ్లారు.

ఈ పిల్లలకు దిక్కెవరు?



మా అమ్మ ఆ గదిలో నిద్రపోతోంది

..అంటూ మార్చురీ వైపు చేయి చూపిస్తున్నారు.

అమ్మ కావాలి .. ఎంతసేపటికీ అమ్మ కనిపించకపోవడంతో ఏడుపు

నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో సోమవారంనాటి ఈ దృశ్యాలు అక్కడివారిని కంటతడి పెట్టించాయి.

ఆస్పత్రి ప్రాంగణం చిన్నారులకు అన్నం తినిపిస్తున్న అమ్మమ్మ ఆదెమ్మ

తమ బాగోగులు చూసుకునే అమ్మ చనిపోయిందని వాళ్లకు తెలియదు. ఆ అమ్మను క్షణికావేశంలో చంపింది తమ నాన్నే అనీ తెలియదు. అతడు చట్టానికి దొరక్కుండా పారిపోయాడనీ తెలియదు. ఇలా అభం శుభం తెలియని ఆ ముగ్గురు చిన్నారులు.. ఎప్పటికీ రాని.. అమ్మకోసం ఏడుస్తూ ఎదురు చూస్తున్నారు. ఇలా ముగ్గురు చిన్నారులను దిక్కులేనివారిగా మార్చిన ఘటన నేపథ్యాన్ని చూస్తే.. చిట్టమూరుకు చెందిన వీణమ్మను ఆరేళ్ల కిందట శ్రీనివాసులు ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరు నాయుడుపేట మండలం మడఫలం వద్ద పూరిగుడిసెలో నివసిస్తూ, కూలి పనులు చేసుకుంటున్నారు. వీరికి అఖిల, బత్తెయ్య, ఆదెయ్య పిల్లలు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి భార్యాభర్తలు కల్లు తాగి ఇంటికి వెళ్తుండగా చిన్నపాటి వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం పెద్దదికావడంతో రాయితో భార్య వీణమ్మ ముఖంపై శ్రీనివాసులు బలంగా కొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. సందర్భంగా ఆ ముగ్గురు చిన్నారులు వైద్యశాల ప్రాంగణంలో కూర్చుని అమ్మకావాలంటూ ఏడుస్తున్న సంఘటన అందరినీ కంటతడి పెట్టించింది. తల్లి చనిపోవడం.. తండ్రి పరారీలో ఉండటంతో అనాథలుగా మారిన ఆ ముగ్గురు చిన్నారులను అమ్మమ్మ ఆదెమ్మ తన వెంట తీసుకెళ్లింది. మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో పోస్టుమార్టం అనంతరం నాయుడుపేట మున్సిపల్ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

- నాయుడుపేట టౌన్, ఆంధ్రజ్యోతి

'ఆడుదాం ఆంధ్ర' అవినీతిపై

విజిలెన్స్

- రోజా ఇలాఖాపై ప్రత్యేక దృష్టి

తిరుపతి(నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి ఆర్కే రోజా సారథ్యంలో జరిగిన 'ఆడుదాం.. ఆంధ్ర' క్రీడల కార్యక్రమాల్లో జరిగిన అవినీతి తీగ లాగుతున్నారు. తిరుపతి జిల్లాలో ముఖ్యంగా రోజా ప్రాతినిథ్యం వహించిన నగరి నియోజకవర్గంలో చోటుచేసుకున్న అవకతవకల చిట్టాను సేకరించే పనికి తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్ అధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. 2023-24 సంవత్సరంలో హడావుడిగా ప్రారంభించిన 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నిధులు జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధుల్లో గోల్‌మాల్ జరిగిందంటూ అనేక ప్రాంతాల నుంచీ విజిలెన్సు డీజీ హరీష్ కుమార్ గుప్తాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు. దీంతో విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నుంచి అవసరమైన రికార్డులు తెప్పించి పరిశీలించారు. జిల్లాలో ఆట స్థలాలే లేని చోట్ల కూడా ఆటలు జరిగినట్లుగా పేర్కొన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా నగరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు రావడంతో విజిలెన్సు డీఎస్పీ మల్లికార్జున రావు, సీఐ చంద్రశేఖర నాయక్, సిబ్బంది విచారణ చేస్తున్నారు. మరో మూడు రోజుల పాటు ఇది కొనసాగనుంది. జిల్లాకు 'ఆడుదాం-ఆంధ్ర' కింద నిధులు ఎంత వచ్చాయి? ఎంత ఖర్చు చేశారు? ఆటలకు సంబంధించి ఎన్ని కిట్లు కొనుగోలు చేశారు? వీటిని ఎక్కడ నుంచి తెప్పించారు? వాటి నాణ్యత ఏమిటి.. వంటి వివరాలను ఆరా తీస్తున్నారు. దీంతో పాటు క్రీడాకారులకు భోజన సదుపాయాలు, తదితర విషయాల మీద కూడా వివరాలు సేకరిస్తున్నారు.

పదవి నుంచి తప్పుకోండి!

జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడికి ప్రభుత్వ ఆదేశం

తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు నాగ శశిధర్ రెడ్డిని ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. 2022 ఫిబ్రవరి 3న అప్పటి ప్రభుత్వం తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడిగా నాగ శశిధర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సంబంధిత పదవిలో నాలుగేళ్ల పాటు కొనసాగుతారని పేర్కొంది. నాగ శశిధర్‌రెడ్డి నియామకం విషయంలో ప్రభుత్వం నిబంధనలు పాటించలేదని, ఆ కారణంగా ఆ నియామకం చెల్లదని ప్రకటించాల్సిందిగా అభ్యర్థిస్తూ వై.షణ్ముగం అనే వ్యక్తి హైకోర్టులో రిట్ పిటిషన్ (నంబరు 20764-2022) దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి బెంచి నాగ శశిధర్‌రెడ్డి నియామకం చెల్లదంటూ 2024 నవంబరు 15న ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు తన ఉత్తర్వులను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు నెలలు గడువు కూడా ఇచ్చింది. అయితే సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ నాగ శశిధర్‌రెడ్డి హైకోర్టు డివిజన్ బెంచిలో రిట్ అప్పీలు (నంబరు 949-2024) దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచి గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 25న ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు డివిజన్ బెంచి తాజా ఉత్తర్వుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు నాగ శశిధర్‌రెడ్డిని తన పదవి నుంచీ తప్పుకోవాల్సిందిగా ఆదేశిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి అక్షరం అండగా..

జీవకోన దశ తిరుగుతోంది

సదస్సులో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న తిరుపతి కమిషనర్

రోడ్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు, మరికొన్ని పనులకు గ్రీన్ సిగ్నల్

అవుట్ పోస్టుతో పాటు 120 సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీస్ శాఖ సిద్ధం

జీవకోన సమస్యలు పరిష్కరిస్తున్నాం



జీవకోనలో ఆంధ్రజ్యోతి చేపట్టిన సదస్సులో ప్రజలు లేవనెత్తిన సమస్యలను నోట్ చేసుకున్నాం. ప్రాధాన్యత పనులను దశలవారీగా పూర్తిచేస్తున్నాం. సదస్సు తర్వాత ఇప్పటికే సుమారు రూ.50లక్షల విలువగల రోడ్లు, డ్రైన్ కాలువలను నిర్మించాం.తాజాగా మరో రూ.52.30లక్షల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రూ.6.50 లక్షలతో గోవిందనగర్‌లో సీసీ రోడ్డు, రూ.9.90 లక్షలతో జ్యోతి లెప్రసీ కాలనీలో సీసీ డ్రైన్, రూ.9.96లక్షలతో రాజీవ్‌గాంధీ కాలనీలో సీపీ డ్రైన్, అరుణోదయ నగర్, సత్యనారాయణపురంలో రూ.9.95లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణాలు, రూ.6లక్షలతో క్రాంతి నగర్, విజయపురం, పార్వతి నగర్ వద్ద యూడీఎస్ లైన్ పునరుద్ధరణ, సీసీ ప్యాచ్ పనులు చేపట్టనున్నాం. రూ.10లక్షలతో శ్మశానవాటిక ప్రహరీగోడ, సంతోషనగర్లో నీటి సంపు, నీటి పైపులైన్లను ఏర్పాటు చేయనున్నాం.

- ఎన్. మౌర్య, కమిషనర్, నగరపాలక సంస్థ, తిరుపతి.





సత్యనారాయణపురం వద్ద రోడ్డు బాగుపడిందిలా..

'అక్షరం అండగా... సమస్యల పరిష్కారమే అజెండాగా..' తిరుపతి నగరంలోని జీవకోనలో మూడు నెలల కిందట ఆంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన సదస్సులో ప్రజలు వెల్లడించిన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయి. సదస్సులో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య దృష్టికి వచ్చిన సమస్యలను దశల వారీగా పరిష్కరించుకుంటూ వస్తున్నారు. పాడైన బోర్లు మరమ్మతులు చేశారు. తిరుమల బైపాస్ రోడ్డునుంచి సత్యనారాయణపురం వెళ్లే 30 మీటర్ల రోడ్డు పనులు పూర్తి చేశారు. దీంతో ప్రజలకు రాకపోకలకు అవకాశం రావడంతో ఇబ్బంది తప్పింది. అదేవిధంగా జీవకోన పరిధిలోని సత్యనారాయణపురం-ఎర్రమిట్ట తూర్పు రోడ్డు రాళ్లు తేలిపోయి వుండేది. ఆంధ్రజ్యోతి సదస్సులో రోడ్ల సమస్యలపై పలువురు ప్రస్తావించారు. రూ37.5 లక్షల నిధులతో యుద్ధప్రాతిపదికన సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. ఇక క్రాంతి నగర్, పార్వతి నగర్‌లో డ్రైనేజీ కాలువలు దెబ్బతిన్నాయి. రూ9.97లక్షలతో సీసీ డ్రైన్‌లను, బాలగంగమ్మ గుడి సమీపంలోని మాధవ నగర్లో రూ.7.40లక్షలతో సీసీ రోడ్డును కార్పొరేషన్ నిర్మించింది. అంతేకాకుండా మరో రూ.50 లక్షల పనులకు కమిషనర్ శనివారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

త్వరలో పోలీస్ అవుట్‌పోస్ట్

ఆకతాయిలు, అసాంఘిక శక్తుల నుంచి జీవకోనను కాపాడాలని పలువురు మహిళలు ఆంధ్రజ్యోతి సదస్సులో మొరపెట్టుకున్నారు. ఈ అంశాన్ని ఆంధ్రజ్యోతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన జీవకోనపై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన హామీ మేరకు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు. దీంతో పాటు జీవకోన ప్రాంతంలో 120 సీసీ కెమెరాలను పోలీస్ శాఖ ఏర్పాటు చేయనుంది. ఇక ఇటీవల ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జేఎంసీ ట్రస్టు తరఫున రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.



అప్పుడు.. క్రాంతినగర్‌లో పాడైన డ్రైన్ కాలువలు



ఇప్పుడు.. సీసీ డ్రైన్ నిర్మించిన తర్వాత



మాధవనగర్‌లో గతంలో పాడైన రోడ్డు.. ఇప్పుడు కార్పొరేషన్ వేసిన సిమెంటు రోడ్డు

స్థానికాలయాలకు

మహర్దశ

- భక్తులకు మెరుగైన సేవలకు పెద్దపీట
- పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పనపై కసరత్తు
- పైలెట్ ప్రాజెక్టుగా తిరుచానూరు అమ్మవారి ఆలయం
- నేటి టీటీడీ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం



టీటీడీకి అనుబంధంగా ఉన్న స్థానికాలయాల అభివృద్ధిపై పాలకమండలి ప్రత్యేక దృష్టిపెట్టనుంది. భక్తులకు మెరుగైన సేవలు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి శ్రీవారి ఆలయం, అప్పలాయగుంట, నారాయణవనం, పాపవినాశనం, ఆకాశగంగ తదితర ప్రాంతాలపై టీటీడీ ఫోకస్ పెట్టనుంది. ఆమేరకు మంగళవారం జరగనున్న టీటీడీ పాలకమండలి సమావేశంలో సభ్యులు ఆమోదం తెలపనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్ 2047 లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని టీటీడీ నిర్ణయాలు ఉండబోతున్నాయి. సీఎం సూచించే పొదుపు మంత్రాన్ని పాటిస్తూ, శ్రీవారి నిధులను ఆర్భాటాల కోసం దుర్వినియోగం చేయకుండా ఎంతమేర అవసరమే ఆ దిశగా ఖర్చుపెట్టేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయాన్ని ఎంచుకోనున్నట్టు సమాచారం.

ప్రస్తుతం రోజుకు 30వేల మంది భక్తులు అలమేలు మంగమ్మను దర్శించుకుంటున్నారు.భవిష్యత్తులో ఈ సంఖ్య 40వేలకు చేరే అవకాశం ఉందని టీటీడీ అధికారుల అంచనా. ఆ దిశగా అవసరమైన మౌలిక వసతులపై టీటీడీ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఎటువైపు నుంచి వచ్చినా తిరుచానూరు ఆలయానికి వెళ్లే మార్గాలు తెలిసేలా నలువైపులా ఆర్చిలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.తోళప్ప గార్డెన్, ఫ్రైడే గార్డెన్ సుందరీకరణ,ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టనున్నారు. క్యూలైన్లు, కాలం చెల్లిన కల్యాణ మండపాల ఆధునికీకరణపైనా దృష్టి పెట్టనున్నారు.

సత్రాలపై విచారణకు నిర్ణయం?

తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి బాగుచేసిన గోవిందరాజ స్వామి సత్రాలను పూర్తిగా కూల్చివేసి కొత్తవి నిర్మించేందుకు రూ.600కోట్లు కేటాయిస్తూ గత వైసీపీ పాలనలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేటాయింపుల వెనుక కాంట్రాక్టర్ నుంచి పెద్ద ఎత్తున నిధులు చేతులు మారాయన్న విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో దీనిపై విచారణకు పాలకమండలి నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- విచారించి నిగ్గు తేల్చండి
- విజిలెన్సు ఎస్పీకి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి విజ్ఞప్తి

టీటీడీ తులాభారంలోనూ అక్రమాలు



విజిలెన్స్ ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి తులాభారంలోనూ చాలా అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారు. వీటన్నింటిపై విచారించి అక్రమార్కుల నిగ్గు తేల్చండి' అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తిరుపతిలో విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. తిరుమల తులాభారం వద్ద పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులు లక్షలాది రూపాయలు తీసుకుని బయటకు వచ్చారన్నారు. తులాభారంలో జరిగిన అక్రమాలను అప్పటి విజిలెన్సు అధికారులు బయటపెట్టినా, టీటీడీ ఉన్నతాధికారులు విచారణ జరపకుండా అవినీతిపరులను కాపాడే ప్రయత్నం చేశారని ఆరోపించారు. భక్తులు సమర్పించిన కానుకలను సగం లెక్క చూపి సగం దొంగతనంగా తీసుకెళ్లారని పలువురు భక్తులు తనకు ఫిర్యాదు చేశారన్నారు. తక్షణమే వాటిపై విచారించి కేసు నమోదు చేయాలని విజిలెన్సు ఎస్పీని కోరామన్నారు. పరకామణిలో దొంగతనం చేసిన ఉద్యోగి విషయంలో చెట్ల కింద పంచాయితీ చేసినట్లుగా చేసి భేషరతుగా విడిచి పెట్టారన్నారు. అదే విధంగా తులాభారంలో దొరికిన దొంగలపైనా కేసు నమోదు చేయకుండా విడిచి పెట్టారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు చూస్తుంటే శ్రీవారి ఆభరణాలను సైతం దొంగలించారేమో అని అనిపిస్తుందన్నారు. తులాభారంలో జరిగిన అవినీతి అక్రమాలపై టీటీడీ ఛైర్మన్, ముఖ్యమంత్రి, డీజీపీ దృష్టికి తీసుకెళ్ళి అవినీతిపరులకు శిక్ష పడేలా చేస్తానన్నారు. అక్రమంగా దోచుకున్న శ్రీవారి ఖజానాతో టీటీడీ దొంగలు తక్కువ కాలంలో కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. కాగా, 2019-24 మధ్య తిరుమల పరకామణి, నెయ్యి కల్తీ, శ్రీవారి శేష వస్త్రాలను సైతం తస్కరించి అమ్ముకోవడం తదితరాలపై దర్యాప్తు చేయాలని భానుప్రకాష్‌రెడ్డి డిమాండు చేశారు.

23న టీడీపీ పార్లమెంటు

మినీ మహానాడు

అదే రోజు తిరుపతి, సత్యవేడు సెగ్మెంట్లు కూడా

నేడు చంద్రగిరి.. 21న సూళ్లూరుపేట.. 22న వెంకటగిరి

తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు స్థాయి మినీ మహానాడు ఈనెల 23వ తేదీన జరగనుంది. అదే రోజు ఉదయం సత్యవేడు అసెంబ్లీ సెగ్మెంట్ మినీ మహానాడు జరగనుండగా తిరుపతి పార్లమెంటుతో కలిపి తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్ మినీ మహానాడు కూడా నిర్వహించనున్నట్టు సమాచారం. ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో టీడీపీ మహానాడు జరగనున్న నేపథ్యంలో.. ఆలోపే జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంటు స్థాయి మినీ మహానాడు కార్యక్రమాలు పూర్తి చేసేందుకు పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో ఇప్పటికే సర్వేపల్లి, శ్రీకాళహస్తి, గూడూరు నియోజకవర్గాల్లో మినీ మహానాడులు ముగిశాయి. తిరుపతి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి సెగ్మెంట్లు పెండింగు వున్నాయి. జిల్లాకే చెందినప్పటికీ చిత్తూరు పార్లమెంటు పరిధిలోని చంద్రగిరి సెగ్మెంట్ మినీ మహానాడు నేడు మంగళవారం తిరుపతి రూరల్ మండలంలో ఎమ్మెల్యే పులివర్తి నాని నివాసం సమీపంలో జరగనుంది. సూళ్లూరుపేట నియోజకవర్గ మినీ మహానాడు ఈనెల 21న ఉదయం నాయుడుపేటలోను.. వెంకటగిరి మినీ మహానాడు 22వ తేదీ సాయంత్రం వెంకటగిరిలో నిర్వహిస్తున్నారు. సత్యవేడు మినీ మహానాడు ఈనెల 23న ఉదయం జరగనుంది. అక్కడ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సస్పెన్షన్‌లో వున్నందున పార్టీ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతి బాబు ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు తిరుపతి పార్లమెంటు స్థాయి మినీ మహానాడు తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో జరపనున్నారు. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన మినీ మహానాడు కూడా అందులో భాగంగానే నిర్వహించే అవకాశముంది.

ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా

సుగుణమ్మ బాధ్యతల స్వీకరణ



ఏపీజీబీసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన సుగుణమ్మ, పక్కన కుటుంసభ్యులు కీర్తి, శ్రీను తదితరులు

తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) చైర్‌పర్సన్‌గా తిరుపతి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జి ఎం.సుగుణమ్మ సోమవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్రతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, తిరుపతి ప్రముఖులు హాజరయ్యారు. ఏపీజీబీసీ ఎండీ శ్రీనివాసులు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. సుగుణమ్మతో పాటు ఆమె మనవరాలు బీవీ కీర్తి, మనవడు భట్టే శ్రీను ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు.



సుగుణమ్మకు పూలబొకే ఇచ్చి అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ నాయకులు



విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపుతున్న సిబ్బంది

ఏపీ ఈఏపీ సెట్ ప్రారంభం

● హాజరైన 2,277 మంది విద్యార్థులు

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశానికి సంబంధించిన పరీక్షలు తిరుపతిలో 5, గూడూరు 4, పుత్తూరులో 2 మొత్తం 11 కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 2,458 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,277 మంది రాశారు. 181 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు పరీక్ష నిర్వహిస్తారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు పరీక్షలు జరుగుతాయి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

షార్‌లో ప్రారంభమైన యువికా

ఇస్రో నిర్వహించే యువికా-2025 (యువ విజ్ఞాన కార్యక్రమం) శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర షార్‌లో సోమవారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అన్ని ఇస్రో సెంటర్లలో ఈనెల 30 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. యువికాకు ఎంపికైన 50మంది విద్యార్థులు షార్‌కు విచ్చేశారు. వీరికి ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల రూపకల్పన, అంతరిక్ష పరిశోధనలపై శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. రాకెట్ ప్రయోగ వేదిక, స్పేస్ మ్యూజియాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,571

తలనీలాలు సమర్పించినవారు: 33,372



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వర్షంలోనూ తరలివచ్చారు

● పీజీఆర్ఎస్‌కు 257 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), మే 19(ఆంధ్రజ్యోతి): వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 257 అర్జీలు అందగా అందులో 155 రెవెన్యూ శాఖకు చెందినవే. అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.

పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి



రేణిగుంట మండలం మామండూరులో ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయి. పంట పొలాలపై దాడులు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. అటవీ శాఖ ఏర్పాటు చేసిన కందకాలు పూడిపోవడంతో మామిడి తోటల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- చిట్టెమ్మ, మామండూరు, రేణిగుంట మండలం

జేమ్స్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, సుమన్, వెంకటేష్ కోరారు. ఈ మేరకు అధికారులకు విన్నవించారు.

పనిచేయని లిఫ్టు :వారం రోజులుగా కలెక్టరేట్‌లో లిఫ్టు మొరాయిస్తూనే ఉంది. దీంతో అటు అర్జీదారులు, ఇటు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లిఫ్టు పనిచేయకపోవడంతో సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చిన వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతులు అవస్థలు పడ్డారు.

రుయాలో చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), మే 19 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో మలబద్దకంతో బాధపడుతున్న రెండేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స చేసి పరిష్కరించామని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ సోమవారం మీడియాకు తెలిపారు. కర్నూలు జిల్లా ఒలిచాడుకు చెందిన శ్రావణి, గిరిరాజుల కుమార్తెకు ఎనీమ ఇస్తే తప్ప మలవిసర్జనకు వెళ్లలేని పరిస్థితిలో పలు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయిందన్నారు. ఇటీవల రుయాస్పత్రికి తీసుకురాగా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు జగదీష్ పరీక్షించి పెద్దపేగు నాడీ వ్యవస్థకు సంబంధించి లాంగ్ సెగ్మెంట్ హిర్చ్‌పురంగ్ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారన్నారు. మూడు దశల్లో క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి సమస్యను పరిష్కరించారన్నారు. సోమవారం చిన్నారిని డిశ్చార్జి చేశామన్నారు. ఈ వైద్య బృందాన్ని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, సూపరింటెండెంట్ రాధ అభినందించారు. ఏఆర్ఎంవో హరికృష్ణ, డాక్టరు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి సిందూర్‌తో సమాధానం

● త్రిపుర మాజీ సీఎం బిప్లవ్ కుమార్‌దేవ్



సమావేశంలో మాట్లాడుతున్న బిప్లవ్ కుమార్‌దేవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 19(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి బదులుగా చేపట్టిన ఆపరేష్ సిందూర్ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక అని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బిప్లవ్ కుమార్‌దేవ్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన నగరంలో సోమవారం జరిగిన ఆపరేషన్ సిందూర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ముందుగా అమరవీరుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సిందూర్ ద్వారా మన సైనిక బలాన్ని ప్రపంచానికి చూపించామన్నారు. చైనా రాడార్ వ్యవస్థకూ అంతుచిక్కకుండా పాక్‌పై దాడులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా ఇంచార్జి రాటకొండ విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, పెనుబాల చంద్రశేఖర్, డాక్టర్ నరేష్, మల్లకుప్ప శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోగుల కోసం 'స్విమ్స్ సేవ'



స్విమ్స్ సేవ సహాయకులతో కరచాలనం చేస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), మే 19(ఆంధ్రజ్యోతి): టీటీడీలో శ్రీవారి సేవ మాదిరిగా.. రోగుల సహాయం కోసం స్విమ్స్ సేవను సోమవారం ప్రారంభించినట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. టీటీడీ చైర్మన్, ఈవో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 42 విభాగాల పరిధిలో రోజుకు 20 మంది చొప్పున స్విమ్స్ విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా ఈ సేవకు నియమించామన్నారు. ఓపీ సమయంలో వీరు రోగులకు సాయం చేస్తారన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, ఫిజియో థెరపీ కళాశాల ప్రిన్సిపల్ మాధవి, వైద్యాధికారులు వివేకానంద్, మురళీ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సార్.. ఆదుకోండి

● పక్షవాతంతో బాధపడుతున్న కానిస్టేబుల్ వేడుకోలు

● మానవత్వం చూపిన ఎస్పీ

● పోలీస్ పీజీఆర్ఎస్‌కు 67 వినతులు



పక్షవాతంతో బాధ పడుతున్న రిజర్వు కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రిజర్వు విభాగంలోని కానిస్టేబుల్ శివకుమార్ కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధ పడుతున్నారు. నడవలేక.. సరిగా మాట్లాడలేక.. నిలబడలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో తనను ఆదుకోవాలని కోరుతూ సోమవారం కుమారుడు, భార్యతో కలసి ఎస్పీ కార్యాలయానికి వచ్చారాయన. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. ఆయన బాధ, విధులు నిర్వహించడానికి పడుతున్న కష్టాలను ఎస్పీకి వివరించారు. దాదాపు అరగంట పాటు ఆయనతో హర్షవర్ధన్‌రాజు మాట్లాడి బాధలు తెలుసుకున్నారు. పరిపాలనాధికారిని పిలిపించి తక్షణం ఆయనకు అవసరమైన ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు అందించాలని ఆదేశించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తనపట్ల ఎస్పీ చూపిన ఆదరణకు రిజర్వు కానిస్టేబుల్ శివకుమార్ కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు.

కేవీబీపురం ఘటనపై విచారణకు ఆదేశం

ఇటీవల కేవీబీపురంలో చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు స్థానిక నాయకుల ప్రమేయంతో పోలీసులు బాధితులపైనే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపారని బాధిత మహిళలు కొందరు ఎస్పీని కలిసి వివరించారు. దీనిపై విచారించి సమగ్ర నివేదిక అందచేయాలని పుత్తూరు డీఎస్పీ రవికుమార్‌ను ఎస్పీ ఆదేశించారు.

సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి

పోలీసు పీజీఆర్ఎస్‌కు వచ్చిన 67 ఫిర్యాదులను పరిశీలించిన పోలీసు అధికారులు కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సమస్యలు పరిష్కారంలో పోలీసు అధికారులు జవాబుదారీతనంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, సీఐలు సాధిక్ ఆలీ, జయచంద్ర, కేవీఎస్ నాయుడు, ఇమ్రాన్‌భాషా, జయచంద్ర, శ్రీరాములు, రామయ్య, తిమ్మయ్య, బాబీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కొందరు కానిస్టేబుళ్లు తమకున్న ఇబ్బందులు చెప్పి అనుకూల ప్రాంతానికి బదిలీ చేసి ఆదుకోవాలనే విజ్ఞప్తిపై ఎస్పీ సానుకూలంగా స్పందించారు.

గిరిజన బాలుడి అదృశ్యం

● యజమానిపై తల్లి ఫిర్యాదు



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, మే 19 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చేవరకు కుమారుడిని బాతులు మేపేందుకు వదిలిపెట్టి వెళ్లారా గిరిజన మహిళ. ఇప్పుడొచ్చి అడిగితే యజమాని నుంచి సరైన సమాధానం రాలేదు. బాలుడు కనిపించకుండా పోయాడని, వెతుకుతున్నామంటూ చెబుతున్నాడు. దీంతో ఆ తల్లి సత్యవేడు పోలీసులను ఆశ్రయించారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కథనం మేరకు.. గూడూరు మండలం చవటపాళేనికి చెందిన అంకమ్మ తన భర్త చెంచయ్యను వదిలేశారు. అదే గ్రామానికి చెందిన ప్రకాష్‌తో కలిసి తన ముగ్గురు పిల్లలను తీసుకుని సత్యవేడు పట్టణంలోని దళవాయి అగ్రహారానికి చెందిన ముత్తు వద్ద బాతులు మేపుతూ రెండేళ్లుగా జీవనం గడుపుతున్నారు. పది నెలల కిందట తన భర్త చెంచయ్య మృతి చెందడంతో గ్రామానికి బయలుదేరుతున్న ఆమెను ముత్తు అడ్డుకుని, తన బాకీ ఇచ్చి వెళ్లాలని చెప్పారు. దీంతో ఆమె కుమారుడు వెంకటేష్(9)ను ఇక్కడే వదిలి.. బాకీ చెల్లించి తీసుకెళతానని చెప్పి వెళ్లారామె. అప్పట్నుంచి వెంకటేష్ తన తల్లితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతుండే వాడు. ఇటీవల నెల రోజులుగా పిల్లాడు ఫోన్ చేయడం లేదని ఆందోళన చెందిన అంకమ్మ.. వారం కిందట సత్యవేడుకు వచ్చి ముత్తు వద్ద తన కుమారుడి గురించి అడిగారు. తమిళనాడు రాష్ట్రం కంచి పరిసరాల్లో బాతులు మేపేందుకు వెళ్లగా తప్పిపోయాడని వెతికి తీసుకొస్తామని, కొంత గడువు ఇవ్వాలని అతడు అడిగారు. మళ్లీ రెండు రోజుల క్రితం ఆమె సత్యవేడుకు వచ్చి.. బాకీ మొత్తం చెల్లించేస్తానని, తన కుమారుడిని ఇవ్వాలని కోరారు. ఇంకా పిల్లాడు దొరకలేదని, తాము వెతికే పనిలోనే ఉన్నామని ముత్తు చెప్పారు. దీనిపై ఆమె గట్టిగా తన కుమారుడు కావాలని పట్టుబట్టారు. దీంతో ముత్తు, అతడి భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్ కలిసి అంకమ్మను కులం పేరుతో దూషించి బయటకు గెంటేశారు. దీంతో ఆమె సత్యవేడు పోలీసులకు సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సత్యవేడుకు చేరుకుని విచారించారు. ముత్తు, ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. సీఐ మురళి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. కాగా, పిల్లాడికి ఏమైనా జరిగిందా? తప్పిపోయినట్లు నమ్మిస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయ నాయకులు

21న డీఈవో కార్యాలయం ముట్టడి

తిరుపతి(విద్య), మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీ నిబంధనలను సవరించాలని కోరుతూ ఈనెల 21న చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తెలిపింది. ఈ మేరకు సోమవారం తిరుపతిలోని యూటీఎఫ్ భవనంలో సమావేశమై నిర్ణయించారు. ఐక్యవేదిక జిల్లా స్టీరింగ్ కమిటీ ముత్యాలరెడ్డి, జగన్నాథం, సురేష్, సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. బదిలీలకు సంబంధించి తమ ప్రతిపాదలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. 117 జీవో రద్దు పేరుతో గతంలో 6 విభాగాలుగా ఉన్న పాఠశాలలను 9 విభాగాలుగా మార్చి చేతులు దులుపుకోవడం ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యం కాదన్నారు. 3,4,5 తరగతులను మోడల్‌స్కూల్ పేరుతో తరలించడంవల్ల చాలావరకు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి చిన్నారులు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి మోడల్ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి స్పందన లభించనందున చిత్తూరు డీఈవో కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేయనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, వయ్యాల మధు, సుభాష్ చంద్రదాస్, వెంకటరమణ, రెడ్డి శేఖర్, మోహన్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అతివలకు భరోసా వన్‌స్టాప్ సెంటర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 19(ఆంధ్రజ్యోతి): మిషన్ శక్తి వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు భరోసా అని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మిషన్‌శక్తి వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతిలోని మెటర్నటీ ఆస్పత్రిలో ఇప్పటికే మిషన్‌శక్తి వన్‌స్టాప్ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురైనప్పుడు తక్షణం ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, సుజాత పాల్గొన్నారు.

మనమిత్ర సేవలు స్టాండ్ల అందజేత

వాట్సప్ మనమిత్ర ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అనే స్టాండ్స్‌ను సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి నారాయణరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమలకు సహకరించండి

మామిడి ఫ్యాక్టరీ యజమానులకు సహాయ సహకారాలు అందించాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన వర్చువల్ విధానం ద్వారా బ్యాంకు అధికారులతో సమీక్షించారు. మ్యాంగో పల్ప్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో రెండేళ్లుగా జ్యూస్ అమ్ముడుపోక చాలా వరకు నిల్వ ఉన్నాయన్నారు. బ్యాంకులకు వారు కట్టాల్సిన వడ్డీని ఆరు మాసాలు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్ పాల్గొన్నారు.



పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ



జస్టిస్ దుర్గాప్రసాద్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ కన్సిస్టింగ్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భువనేశ్వర్ కలిత, సభ్యులు, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్, అలాటి నటి జయచిత్ర, నటి అషురెడ్డి ఉన్నారు.





→ జయచిత్ర - అషురెడ్డి ←



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు కొత్త హంగులు

● 22న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

సూళ్లూరుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఈనెల 22న ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ పథకం కింద రూ.12.77 కోట్లతో ఈ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించారు. దీని ప్రారంభోత్సవానికి రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

టీచర్ మెడలో చైన్ లాక్కెళ్లారు

తిరుపతి (నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని వినాయక గుడి వద్ద ఉపాధ్యాయుడి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటనపై సోమవారం ఫిర్యాదు అందింది. ఈనెల 15వ తేదీన రాయచోటిలో వివాహం కోసం కారులో కొందరు ఉపాధ్యాయులు బయలుదేరారు. ఈ క్రమంలో లక్ష్మీపురం సర్కిల్ వద్ద వీరు బహిర్భూమికి వెళ్లారు. తిరుచానూరుకు దారెటు అంటూ ఓ వ్యక్తి వీరిని అడిగాడు. వీరు సమాధానం చెప్పేలోపే ఉపాధ్యాయుడి మెడలోని 18 గ్రాముల గొలుసు లాక్కెళ్లిపోయాడు. ఉపాధ్యాయుడు అరిచేలోపే సమీపంలో ఉన్న మరో వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఆ దుండగుడు పరారయ్యాడు. పెళ్లి అనంతరం తిరిగొచ్చిన కేశవనాయన గుంటకు చెందిన టీచర్ చంగల్ రాజు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.1.6 లక్షల జరిమానా

తిరుపతి (నేరవిభాగం), మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో డ్రంకెన్ డ్రైవ్ చేస్తున్న 16 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణచారి, సీఐలు సుబ్బారెడ్డి, సంజీవ్ కుమార్, భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి వీరిని అదుపులోకి తీసుకుని 4వ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచారు. ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున రూ.1.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

జూన్ మొదటి వారంలో చంద్రగిరి కోటపై వెలుగులు



ఆర్కియాలజీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోటలో ఏపీ టూరిజం కార్పొరేషన్ పీపీపీ విధానంలో లక్స్ అండ్ డెసిబిల్స్ సంస్థ ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్స్ షో జూన్ మొదటి వారంలో ప్రారంభం కానుంది. సోమవారం రాత్రి ఎమ్మెల్యే పులివర్తి నాని కోట ఆర్కియాలజీ అధికారులతో సమీక్షించారు. సౌండ్ అండ్ లైటింగ్ షో ప్రారంభంలో జాప్యానికి కారణాలపై ఆరా తీశారు. మొదట షో ప్రారంభమైనప్పుడు కథ చరిత్ర ఆధారంగా ఉందని, గత ప్రభుత్వంలో మరమ్మతులు చేశాక అందులో మార్పులు చేయడంతో తమశాఖ ఉన్నతాధికారులు అనుమతివ్వలేదని అధికారులు వివరించారు. షోలో ప్రదర్శించే కథను నిర్దేశిత సంస్థ నిర్ధారించాక అనుమతిస్తామన్నారు. టూరింజంశాఖకు బోటింగ్ ఏర్పాటుకు అనుమతించినా కోనేరును శుభ్రం చేయలేదన్నారు. కోటకున్న 55 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ, ఆర్కియాలజీ అధికారులు సంయుక్తంగా సర్వేచేసి హద్దులు గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. కోట ప్రహరీపైనా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్కియాలజీ కన్సర్వేషన్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి కోరారు. మేషన్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భద్రతా తనిఖీలు



ఫొటోస్టూడియో వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుమల, మే19(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రతాతనిఖీలు కొనసాగుతున్నాయి. సోమవారం పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్, విజిలెన్స్, హెల్త్, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులు సిబ్బందితో కలిసి ఏరియా డామినేషన్ నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. శ్రీవారిమెట్టు, ఆదిశేషు విశ్రాంతిభవనం, ఎంబీసీ34, ఎస్ఎంసీ, ఏటీసీ వంటి ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి తిరుమలకు వచ్చిన కూలీలను ప్రత్యేకంగా విచారించారు. వారి వివరాలను సేకరించి, ఎలాంటి ఆధారాలు లేనివారిని తిరుమల నుంచి పంపేశారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న వారి వేలిముద్రలు, ఐరిష్‌లను పరిశీలించి ఏదైనా నేర చరిత్ర ఉందా అనే అంశాలపై ఆరా తీశారు. కొన్ని దుకాణాలు, ఫొటో స్టూడియోలు, ఫ్రూట్ షాపుల వద్ద కూడా తనిఖీలు చేపట్టారు.

నిమ్మ ధరలు ఢమాల్



గూడూరు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): గూడూరు మార్కెట్‌లో నిమ్మ ధరలు భారీగా పతనమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు నిమ్మధరలు స్థిరంగా ఉంటూ రైతులకు ఆదాయాన్ని ఇచ్చేవి. వారం రోజుల వరకు కిలో గరిష్టంగా రూ.120 నుంచి రూ.160 ధరలు పలికాయి. ప్రస్తుతం గరిష్టంగా రూ.40 వరకు అమ్ముడవుతున్నాయి. టిక్కీ బస్తా(50 కేజీలు) రూ.1000 నుంచి రూ.2000 పలకడంతో గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేరళకు రవాణా చేసే విషయంలో తమిళనాడు మార్కెట్ నుంచి పోటీ ఎక్కువ కావడంతో గూడూరులో ధరలు తగ్గిపోయాయని స్థానిక వ్యాపారులు పేర్కొంటున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారికి సీఎం సహాయనిధి నుంచి రూ.12.98 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. వారికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో గూడూరు పట్టణానికి చెందిన ఇద్దరికి, చిల్లకూరు మండలంలో ముగ్గురికి, చిట్టమూరు మండలంలో ఇద్దరికి, కోట, వాకాడు మండలాల్లో ఒక్కొక్కరికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. ఎవరైనా సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం పొందాలంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురెడ్డి, ఇశ్రాయిల్ కుమార్, జలీల్ అహ్మద్, పెంచలయ్య, మధుయాదవ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కరిమాణిక్యస్వామికి చక్రస్నానం



స్వామి, అమ్మవార్లకు చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామికి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆధార్ కేంద్రం తెరవాలంటూ నిరసన



ఆధార్ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

కోట, మే 19 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని తక్షణం తెరిచి సేవలు అందించాలంటూ సోమవారం పలు గ్రామాల గిరిజనులు నిరసన తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొద్ది నెలల క్రితం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి సేవలను అందిస్తున్నారు. అయితే రెండు వారాలుగా ఆధార్ కేంద్రం పూర్తిగా మూతబడిపోయింది. ఆధార్ అనుసంధానం కోసం మండలంలోని ప్రజలు రోజూ ఎంపీడీవో కార్యాలయానికి రావడం, తాళం వేసి ఉండడంతో నిరాశతో వెనుదిరిగి వెళుతున్నారు. ఆధార్ కేంద్రాన్ని ఎప్పుడు తెరుస్తారో చెప్పే నాధుడు లేకపోవడం, సంప్రదించేందుకు ఫోన్ నెంబర్ కూడా తెలియకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. సోమవారం పలు గ్రామాల గిరిజనులు ఆధార్ కేంద్రం వద్ద నిరసన తెలిపారు.

ఆదర్శనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎనలేని కృషిచేసిన పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పలు కూడళ్ల వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చెన్నూరు గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో శివకుమార్, శంకరయ్య, బీవీ రమణయ్య, మణి, ప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మధు, డాక్టర్ తేజ, శ్రీనివాసులు, రమణయ్య, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, రాజయ్య, రత్నమ్మ, చిరంజీవి, ఎల్లమ్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ వినతులపై సత్వర చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

డక్కిలి, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపుతున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు చెప్పారు. సోమవారం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ తగాదాలు, మ్యుటేషన్, సాగు భూములకు పట్టాలు ఇప్పించాలని, పింఛన్లు వంటి సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయని తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నరాణి, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, పిన్నక జగదీష్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

వెంకటగిరి టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాహనదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సుబ్బారావు హెచ్చరించారు. సోమవారం స్థానిక తూర్పువీధి, రాజావీధి, దక్షిణపు వీధి, ఉత్తరపు వీధి ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా పెట్టిన వాహనాలను పక్కకు తీయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిర్దేశించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.

నేడు జాబ్‌మేళా

వాకాడు/చిట్టమూరు, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వాకాడు ఎంపీడీవో శ్రీనివాసులు, చిట్టమూరు ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 21 బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యవతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వర్షంతో వరి సాగుకు ఊపిరి

సూళ్లూరుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు ఎండల తీవ్రతతో అల్లాడిపోయిన ప్రజలకు వర్షంతో ఉపశమనం లభించింది. సూళ్లూరుపేటలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాగుకు నార్లు పోసుకుని దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఉపకరించింది. సాగుకు సిద్ధం చేసిన పొలాల్లో వర్షంతో తేలికపాటి నీళ్లు నిలబడడంతో వరినాట్లు వేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి పండమటి కండ్రిగ, మన్నారపోలూరు, మంగళంపాడు, వట్రపాలెం, కోటపోలూరు గ్రామాల్లో జోరుగా వరినాట్లు వేస్తున్నారు. 1010 రకం వరి వంగడాలను నాటుతున్నారు.



పడమటి కండ్రిగ పొలాల్లో వరినాట్లు వేస్తున్న కూలీలు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన స్వాతి - పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

పెళ్లకూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పెళ్లకూరు మండలంలోని పునబాక దళితవాడలో సోమవారం జరిగింది. పోలీసులు కథనం మేరకు... తొట్టంబేడు మండలంలోని సింగమాల గ్రామానికి చెందిన స్వాతి(32)కి పునబాక దళితవాడకు చెందిన పైపూరు మురళితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు చాణక్యవర్మ, రీతూ వర్మ ఉన్నారు. మురళి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య, భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. సోమవారం మధ్యాహ్నం కూడా భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన స్వాతి భర్త ఇంట్లో నిద్రిస్తుండగా వరండాలో రేకుల కింద ఇనుప పైపులకు తన చున్నీతో ఉరేసుకుంది. పిల్లలు చూసి కేకలు వేయడంతో భర్త మురళి వెంటనే నిద్రలేచాడు. ఇంతలో గ్రామస్తులు అక్కడకు చేరుకుని స్వాతిని శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పునబాక దళితవాడకు తీసుకెళ్లిపోయారు. కాగా, స్వాతి ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మురళిని అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మురళిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్వాతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో శ్రీకాకుళంవాసి మృతి



మృతి చెందిన గణేష్

నాయుడుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని మంగపతి నాయుడునగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లావాసి గణేష్(38) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన గణేష్ మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో పనిచేసేవాడు. భార్య, కుమారుడితో కలిసి నాయుడుపేట పట్టణంలోని మంగపతి నాయుడు నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం తెల్లవారుజామున బాతు రూముకు వెళ్లేందుకు నిద్రలేచాడు. అదే సమయంలో కింద పడి మృతి చెందినట్లు భార్య కుటుంబసభ్యులకు తెలిపింది. అయితే తన కుమారుడి మృతిపై అనుమానం ఉన్నట్లు గణేష్ తండ్రి నరసింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

పెళ్లకూరులో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో అధికారులు, బీజేపీ నాయకులు, స్థానికులు

పెళ్లకూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో పెళ్లకూరులో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను పట్టుకుని భారత మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంఈవో మించల శంకరయ్య, సూపరింటెండెంట్ అన్నపూర్ణరావు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటేష్, మనోజ్ కుమార్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



సబ్‌కలెక్టర్‌కు అర్జీలను అందజేస్తున్న అర్జీదారులు

గూడూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డివిజన్‌లోని పలువురు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతులు అందజేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 16 అర్జీలను అందగా, ఎక్కువగా భూ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

వీఆర్‌వోలపై చర్యలకు నివేదిక

గూడూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్, ఇందిరానగర్, నలజాలమ్మవీధి సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్‌వోలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు చంద్రశేఖర్ సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు నివేదించారు. ఈ ముగ్గురు వీఆర్‌వోలపై అవినీతి ఆరోపణలు రావడంతో విచారించిన తహసీల్దారు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.

చోరీ కోసం వెళ్లి పట్టుబడిన మహిళ

పోలీసులకు అప్పగించిన ఆబాక గ్రామస్తులు

సూళ్లూరుపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న బీహార్‌కు చెందిన మహిళను మండల పరిధిలోని ఆబాక గ్రామస్తులు పట్టుకున్నారు. సోమవారం రాత్రి ఎవరూ లేని ఓ ఇంట్లో చొరబడుతుండగా గ్రామస్తులు గమనించి పట్టుకున్నారు. ఆమె హిందీలో మాట్లాడుతుండడంతో పోలీసులకు అప్పగించారు. ఆమెతో పాటు వచ్చిన మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

చిట్టమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం గీవెన్స్ డేలో వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ నిరంజన్ కుమార్, సర్వేయర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్ బీ, అండగల్ రావడం లేదు

బాలాయపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): తమ భూములకు వన్ బీ, అడంగల్ రావడం లేదని మండలంలోని కోటంబేడు గ్రామానికి చెందిన ఎస్సీలు బీఎస్పీ నేత రాపూరు అబ్రహం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 224 నుంచి 231 వరకు గల భూముల్లో 42 మందికి 1.95 ఎకరాల చొప్పున 1982లో పట్టాలిచ్చారని తెలిపారు. అయితే వెబ్‌ల్యాండ్‌లో తమ పేర్లు నమోదు చేయాలని ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు ఆర్టీసీ బస్సుల ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న వాకాడు డిపో ఆర్టీసీ బస్సు

చిల్లకూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నెల్లూరు నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వాకాడు నుంచి గూడూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు బస్సులూ పాక్షికంగా దెబ్బతిన్నాయి. బస్సుల్లో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. కొంతసేపు ట్రాఫిక్ ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మురుగు తొలగించండి

కోట, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు మసీదు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల మురుగుదొడ్ల నుంచి దుర్గంధ పూరితమైన వాసన వస్తోందని స్థానికులు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పాఠశాల వెనుక నుంచి మురుగునీరు తమ నివాసాల వైపు వస్తోందని, దుర్వాసన వల్ల దోమలు వృద్ధి చెంది ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. పాఠశాల నుంచి మురుగు తమ ఇళ్ల వైపు రాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్

కోట, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో కూలీల సంఖ్య పెంచాలని ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వరప్రసాద్ అన్నారు. సోమవారం కోటలోని ఉపాధి కార్యాలయంలో ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులతో ఉపాధి పనులపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూలీల శాతం పడిపోయిందన్నారు. మండలంలోని పలు పంచాయతీలకు 34 మురుగునీటి గుంటలు మంజూరు కావడం జరిగిందన్నారు. అదేవిధంగా కొన్ని పంచాయతీలకు ఎరువుల నిల్వ గుంతలను మంజూరు కావడం జరిగిందన్నారు. ఆయా పనులను కూలీల చేత చేయించాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. ఈ సమావేశంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్లు కాటయ్య, కరుణాకర్‌రెడ్డి, పరశురామ్ పాల్గొన్నారు.

22న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

బాలాయపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూరు గ్రామంలో ఈనెల 22వ తేదీన ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం డాక్టర్ లియోన తెలిపారు. తిరుపతిలోని స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే 26వ తేదీన అలిమిలి, నిడిగల్లు, 29న గొట్టికాడు, నిండలి గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

అనాథ శవానికి దహన క్రియలు

కోట, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుగుంట అటవీ ప్రాంతంలో మూడు రోజుల క్రితం 45ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కోట పట్టణ పరిధిలోని శ్మశాన వాటికలో పోలీసులు, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో దహనక్రియలు నిర్వహించారు.

మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం వేకువజామున మోస్తరు వర్షం కురిసింది. ఉదయం గంట పాటు చిరు జల్లులు పడ్డాయి. నాలుగు రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

గూడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం సోమవారం నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి 6 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

కోట, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడుకు చెందిన బాలిక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదని, చుట్టు పక్కల గాలించినా ఆచూకీ దొరకలేదన్నారు.